
epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com




సంపుటి : 19 సంచిక : 120 | 21-07-2026 మంగళవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00



జాతీయ పోలీస్

## అకాడమీలో లైంగిక వేధింపుల వ్యవహారం

ట్రైనీ ఐపిఎస్‌ను సస్పెండ్ చేస్తూ.. ఆదేశాలు జారీ

ఆత్మహత్యకు యత్నించిన ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

లైంగిక ఆరోపణల నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారం ఉత్కంఠగా మారింది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కేసులో ఊహించని పరిణామం ఎదురైంది. ఓ వైపు ఆయనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకోగా,మరోవైపు ఆయన ఆత్మహత్యకు పాల్పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ నేషనల్ అకాడమీ చర్యలు తీసుకుంది. కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

2

## అమిత్ షాతో ధర్మేంద్ర ప్రధాన్ భేటీ

సిజెపిని చర్చలకు పిలిచిన జెపి నడ్డా

న్యూఢిల్లీ,

సిజెపి కార్యకర్తల చలో పార్లమెంట్ పిలుపుతో ఢిల్లీలో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్లమెంట్ భవనం లోపల వీరి భేటీ జరిగినట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. 'చలో పార్లమెంట్' వేళ ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తున్న నాయకులతో కేంద్రమంత్రి జేపీ నడ్డా భేటీ అయ్యారు. అలాగే ధర్మేంద్ర ప్రధాన్ కూడా వారితో మాట్లాడుతున్నారు. మరోవైపు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జేపీ నడ్డా కలవనున్నారని సమాచారం.

## మూడు కాదు..ఒక్క దాంట్లో గెలిచి చూపండి

మరోమారు బిజెపి నేతలకు

రాజాసింగ్ సవాల్

హైదరాబాద్,

నగరంలో మూడు కార్పొరేషన్లు గెలుస్తామని బిజెపి నేతలు ప్రకటించడాన్ని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎద్దేవా చేశారు. మూడు కాదు..ఒక్కటైనా గెలిచి చూపాలని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో బిజెపి నేతల తీరుపై, రాష్ట్రంలో బీజేపీ పరిస్థితిపై ఆ పార్టీ బహిష్కృత నేత రాజాసింగ్ సెటైర్లు వేశారు. బండి సంజయ్, ఈటల కలిస్తే పార్టీ అధికారంలోకి వస్తుందా.. అని పార్టీ రాష్ట్ర నేతలను ప్రశ్నించారు. వారి మధ్య సమస్యలు ఉండవచ్చని, పార్టీలో సీనియర్ నేతలు, కార్యకర్తల పరిస్థితి ఏంటని నిలదీశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు కార్పొరేషన్‌లు గెలుస్తామని చెబుతున్నారని, ఒక్క కార్పొరేషన్‌లో సగం సీట్లయినా గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. బీజేపీలో కొందరికి అధ్యక్ష పదవి దక్కకుండా చేసేందుకే రాంచందర్‌రావును కూర్చొబెట్టారని పేర్కొన్నారు.




# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

2లో

ప్లాట్ల కోసం పది వరకు దరఖాస్తుల స్వీకరణ

రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి

ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు


క్యూర్ పరిధిలో ప్లాట్ల కోసం ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్దిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ప్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పకొచ్చారు. లబ్దిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు, ఇళ్ల బ్రోచర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో రక్షణ లేకుండా పోయింది

ఇందిరమ్మ పాలనలో బాలింతకు కూడా భరోసా లేదు

బాన్సువాడ ఘటనపై స్పందించన ప్రభుత్వం

నిమ్స్‌లో బాలింతను పరామర్శించిన హరీష్ రావు



ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స వికటించి, నిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాలింతలను హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటన జరిగిన పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదుగురు బాలింతలు నిమ్స్‌లో చికిత్స పొందుతున్నార హరీశ్‌రావు తెలిపారు. వీరిలో ముగ్గురు డయాలసిస్‌పై ఉన్నారని పేర్కొన్నారు. తెల్లరక్తకణాలు తగ్గాయి.. కిడ్నీ, లంగ్స్ ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారని చెప్పారు. బాలింతల నుంచి పసిగుడ్డులకు ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిపారు.

వార్త 2లో



## సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది

విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం

పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు.

2



2

## ఉద్రిక్తంగా చలో పార్లమెంట్ పిలుపు

సిజెపి కార్యకర్తల రాకతో పార్లమెంట్ వద్ద ఉద్రిక్త పోలీస్ బారికేడ్లను దాటుకుని వచ్చిన వేలదిమంది ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసుల లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం

## దీక్ష విరమించినట్లు దీప్కే ప్రకటన

సోనమ్ విజ్ఞప్తితో దీక్ష విరమించిన సిజెపి నేత

న్యూఢిల్లీ,

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన ఆమరణ దీక్షను విరమించారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అభ్యర్థన మేరకు దీప్కే తన దీక్షను విరమించినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ మార్చ్ చేస్తున్న వారికి సంఘీభావంగా దీక్షను విరమించాలని వాంగ్‌చుక్ కోరారు. డెహ్రాడూన్‌కు చెందిన నీట్ అభ్యర్థి రాయ్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె తండ్రితో కలిసి దీప్కే దీక్షను విరమించారు. ప్రస్తుతం సఫ్దార్‌జంగ్ ఆస్పత్రిలో వాంగ్‌చుక్ చికిత్స పొందుతున్నారు. జంతర్ మంతర్ వద్ద ఆయన దీక్షను పోలీసులు భగ్నం చేసి ఆస్పత్రికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. వాంగ్‌చుక్‌ను తరలించిన తర్వాత .. అభిజీత్ దీప్కే ఆమరణ దీక్షకు పూనుకున్నారు. మరో వైపు పార్లమెంట్‌లో విద్యార్థుల ఆందోళనపై రచ్చ కొనసాగుతోంది. ఇవాళ ప్రారంభమైన ఉభయసభల్లోనూ విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజీ అంశంపై చర్చ చేయాలని డిమాండ్ చేశాయి.

# ప్రభుత్వాసుపత్రుల్లో రక్షణ లేకుండా పోయింది

**ఇందిరమ్మ పాలనలో బాలింతకు కూడా భరోసా లేదు**

**బాన్సువాడ ఘటనపై స్పందించని ప్రభుత్వం**

**నిమ్స్‌లో బాలింతను పరామర్శించిన హరీష్ రావు**



**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స వికటించి, నిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాలింతలను హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటన జరిగిన పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదుగురు బాలింతలు నిమ్స్‌లో చికిత్స పొందుతున్నార హరీశ్‌రావు తెలిపారు. వీరిలో ముగ్గురు డయాలసిస్‌పై ఉన్నారని పేర్కొన్నారు. తెల్లరక్తకణాలు తగ్గాయి.. కిడ్నీ, లంగ్స్ ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారని చెప్పారు. బాలింతల నుంచి పసిగుడ్డులకు ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిపారు. బాలింతల నుంచి పాలు తాగడం వల్ల నీలోఫర్‌లో పసిగుడ్డులు చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలింతలు పూర్తిగా కోలుకోకుండా పసిగుడ్డులను ఎవరు చూసుకుంటారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరుగురికి 10వ తేదీన ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, నలుగురికి 11వ తేదీన సిజేరియన్ చేశారని హరీశ్‌రావు తెలిపారు. థియేటర్ మెయింటెనెన్స్ సరిగ్గా లేక ఇన్‌ఫెక్షన్ సోకిందని బాధితులు అంటున్నారని అన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కూడా కారణమని అంటున్నారని అన్నారు. కాలం చెల్లిన మందులు వాడినందుకే ఈ పరిస్థితి వచ్చింటున్నారని తెలిపారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. ఘటన జరిగిన పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. వైద్యారోగ్య అధికారులు కనీసం పరామర్శించిన పాపాన పోలేదని విమర్శించారు. ఘటన నుంచి గురించి పూర్తిస్థాయి విచారణకు ఆదేశించలేదని అన్నారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక పేషెంట్ నగలు అమ్మి, అప్పు తెచ్చి వైద్య చికిత్సలు చేయించామని కుటుంబీకులు చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. ఇంత జరిగినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు. ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కేసీఆర్ హయాంలో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్, బాలింతలకు కేసీఆర్ కిట్‌లు ఇచ్చామని తెలిపారు. మహిళల ఆరోగ్యం కోసం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. అమ్మ ఒడి వాహనాల్లో బాలింతలను సురక్షితంగా ఇళ్లకు చేర్చామని చెప్పారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు గణనీయంగా తగ్గాయని అన్నారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

**ప్లాట్ల కోసం పది వరకు దరఖాస్తుల స్వీకరణ**

**రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి**

**ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు**



**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

క్యూర్ పరిధిలో ప్లాట్ల కోసం ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్దిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ప్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్దిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు, ఇళ్ల బ్రోచర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. వారికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5లక్షల సహాయం అందజేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకునే అవకాశం లేదని చెప్పుకొచ్చారు. మొదటి దశలో 16నియోజకవర్గాల్లో ఇస్తున్నామని.. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయా పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామనిపేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అవుతున్నాయని ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేశామని వెల్లడించారు. ఇంటి స్థలంలేని పేదలకు కూడా వీటిని అందజేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి వివరించారు. లాభం, స్వార్థం లేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తున్నామని పేర్కొన్నారు. అజఖీఇ పరిధిలో ఇళ్లు కట్టించే పథకాన్ని ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం పదహారు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని చెప్పుకొచ్చారు. 528 అడుగుల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో తప్పిదాలతో అప్పుడు కట్టిన ప్లాట్లు ఉపయోగపడకుండా పోయాయని చెప్పారు. నగరానికి దూరంగా 35 కిలోమీటర్ల దూరంలో కట్టడంతో పేదలు అక్కడకు వెళ్లలేదని తెలిపారు. చదరపు గజానికి లక్షల విలువ ఉండే కోర్ ప్రాంతంలో టవర్లు నిర్మించి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారని అన్నారు. ఈ పథకం ఫెయిల్ అయితే విమర్శించాలని కొందరు సంతోషపడ్డారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు ఇంటి కల నెరవేర్చాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇలా ఇళ్లు కట్టించి ఇవ్వడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రం తమ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఆ లక్ష్యంతోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే కాంగ్రెస్ ప్రభుత్వం ఒఎఉ ఇళ్లను నిర్మించిందని తెలిపారు. నగరంలో చాలాచోట్ల హౌసింగ్ బోర్డు కాలనీలు ఉన్నాయని ప్రస్తావించారు. ఎంత విలువైన భూమి అయినా పేదలకు ఇవ్వాలని తాము నిర్ణయించామని చెప్పుకొచ్చారు. పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరుగుతోందని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు. మొదటి విడతలో 16నియోజకవర్గాల్లో 7680 ఎ÷-లాట్లను నిర్మిస్తామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. క్యూర్ పరిధిలోని ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో స్థలం లేని పేదలు కిరాయి ఇళ్లలో ఉంటున్నారని తెలిపారు. అజఖీఇలో పేదలకు తమ ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే పథకాన్ని ప్రారంభించామని వెల్లడించారు. గత ప్రభుత్వం హౌసింగ్ విభాగాన్నే రద్దు చేసిందని చెప్పుకొచ్చారు. తాము దాన్ని పునరుద్ధరించామని అన్నారు. బల్కంపేట ఎల్లమ్మ బోనాల ముందు అజఖీఇలో ఈ పథకం ప్రారంభించామని వెల్లడించారు. మళ్లీ వచ్చే బోనాల నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

**దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది**

**విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం**

**పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్-1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని



వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

# ఉద్రిక్తంగా చలో పార్లమెంట్ పిలుపు

**సిజెపి కార్యకర్తల రాకతో పార్లమెంట్ వద్ద ఉద్రిక్త**

**పోలీస్ బారికేడ్లను దాటుకుని వచ్చిన వేలదిమంది**

**ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసుల లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం**

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నీట్-యూజీ పరీక్షల అక్రమాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన 'చలో పార్లమెంట్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సీజేపీ మద్దతు దారులు బారికేడ్లను తోసుకొని పార్లమెంట్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నిం చారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. సోమవారం పార్లమెంట్ మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు, మద్దతుదారులు జంతర్ మంతర్ వద్దకు భారీగా చేరుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది విద్యార్థులు కూడా హాజరయ్యారు. దీంతో ఆ ప్రాంతంలో భద్రతా దళాలు పెద్దఎత్తున మోహరించాయి. దీంతో ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రైసినా రోడ్డు మార్గంలో ఈ ఘటన జరిగింది. పార్లమెంట్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో ఆందోళనకారుల్ని పోలీసులు అడ్డుకున్నారు. జంతర్ మంతర్ నుంచి సీజేపీ.. పార్లమెంట్ మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా వద్ద ఆందోళనకారులపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. సీజేపీ కార్యకర్తలను చెదరగొట్టే ఉద్దేశంతో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. సన్‌సద్ మార్గ్ రోడ్డులో వస్తున్న ఆందోళనకారుల్ని కూడా పోలీసులు అడ్డుకున్నారు. సన్‌సద్ మార్గ్ పోలీసు స్టేషన్ వద్ద బారికేడ్లు పెట్టి నిరసనకారుల్ని ముందుకు కదలకుండా చేశారు. అయినా తోసుకుని రావడంతో భద్రతా బలగాలు లాఠీఛార్జ్ చేశాయి. ఆ ఘర్షణలో కొందరు ఆందోళనకారులు గాయపడ్డారు. సైట్ వద్దే వారికి ప్రథమ చికిత్స అందించారు. వికాస్ మార్గ్‌లోని ఐటీవో వద్ద కూడా నిరసనకారులను బ్లాక్ చేశారు. ఐటీవో, సెంట్రల్ ఢిల్లీ రూట్లో ఇది కీలకమైన ప్రదేశం. పార్లమెంట్, జంతర్ మంతర్ ఈ మార్గంలోనే ఉన్నాయి. పార్లమెంట్ స్ట్రీట్ వద్ద వేల సంఖ్యలో సీజేపీ కార్యకర్తలు చేరుకున్నారు. వారిపై లాఠీఛార్జ్ జరిగినట్లు తెలుస్తోంది. బారికేడ్లను తొలగించేందుకు నిరసనకారులు ప్రయత్నించారు. పోలీసులకు, సీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. సుమారు 15 మంది ఆందోళనకారు లను అదుపులోకి తీసుకున్నారు. ర్యాలీ ప్రారంభమైన వెంటనే నిరసనకారులను భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. దాంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. భాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పలువురు పోలీసులకు గాయాలైనట్లు సమాచారం.

# జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల వ్యవహారం

**ట్రైనీ ఐపిఎస్‌ను సస్పెండ్ చేస్తూ.. ఆదేశాలు జారీ**

**ఆత్మతహత్యకు యత్నంచిన ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి**

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

లైంగిక ఆరోపణల నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారం ఉత్కంఠగా మారింది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కేసులో ఊహించని పరిణామం ఎదురైంది. ఓ వైపు ఆయనను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకోగా,మరోవైపు ఆయన ఆత్మహత్యకు పాల్పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ నేషనల్ అకాడమీ చర్యలు తీసుకుంది. కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. నేషనల్ పోలీస్ అకాడమీ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం మేరకు ఉదయ్ కృష్ణా రెడ్డిని ఎన్‌పీఏ నుంచి అధికారులు పంపించేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తన గురించి మొదట ఎన్‌పీఏ అధికారులకు మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. సీసీటీవీ కెమెరాల ఆధారాలతో పాటు అన్ని ఆధారాలు సేకరించాక ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమేనని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. దీంతో తక్షణమే పోలీస్ అకాడమీ నుంచి నుంచి సస్పెండ్ చేస్తూ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సర్వీస్‌లో జాయినింగ్‌కు సంబంధించి డీవోపీటీ దే తుది నిర్ణయం అని నేషనల్ పోలీస్ అకాడమీ అధికారులు చెబుతున్నారు. ఇదిలావుండగానే ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఎర్రగడ్డలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కృష్ణారెడ్డికి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడంటూ మరో మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. దీంతో అత్తాపూర్ పోలీసులు కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ అంశంపై ఎనిమిది రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ ట్రైనీ ఐపీఎస్‌కు పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే ఈ ఘటన అనంతరం సొంతూరుకు వెళ్లిపోయిన కృష్ణారెడ్డి.. ఆదివారం సాయంత్రం మోతీనగర్‌లోని స్నేహితుడి ఇంటికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించి అతన్ని ఎర్రగడ్డలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. కాగా, ఆత్మహత్యకు ముందు తన తప్పేమీ లేదని ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ స్టేటస్ పెట్టడం గమనార్హం. తనతోపాటు శిక్షణ పొందుతున్న తోటి ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఈ ఏడాది జూన్ 23 నుంచి తనను లైంగికంగా వేధిస్తున్నాడని, వాట్సాప్ ద్వారా అసభ్యకర మెసేజ్‌లు పంపి బూతులు తిడుతున్నాడని ఓ మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి రహస్యంగా తన వ్యక్తిగత ప్రైవేట్ వీడియోలను చిత్రీకరించి తీవ్రంగా బెదిరిస్తున్నాడని, ఆ వీడియోలను తన భర్తకు పంపి మానసికంగా వేధించడంతోపాటు వాటిని సోషల్ మీడియాలో పెడతానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల తనను బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి ప్రైవేట్ భాగాలను తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడటంతోపాటు చంపేందుకు ప్రయత్నించాడని, మెడపై కత్తి పెట్టి ఆ గది నుంచి బయటకు వెళ్లకుండా నిర్బంధించాడని ఆ అధికారి ఆరోపించారు. దీంతో ఉదయ్ కృష్ణారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న అధికారులు.. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మహిళా ఐపీఎస్ ట్రైనీ చేసిన ఆరోపణలు నిజమని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. ఈ కమిటీ నిర్ణయంతో జాతీయ పోలీస్ అకాడమీ నుంచి ఉదయ్ కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. దీనికి ముందు తన తప్పేమీ లేదంటూ వాట్సాప్‌లో స్టేటస్ పెట్టాడు. ఇప్పుడు ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది.

# చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాల ఖాళీలు

**-- అర్హులైన అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకొండి**

చండూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇంగ్లీష్ (01), తెలుగు (01), ఎకనామిక్స్ (01), మరియు కంప్యూటర్ అప్లికేషన్స్ (01) సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫ్యాకల్టీ) నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఘన్‌శ్యామ్ తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే జనరల్ అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులతో, ఎస్సీ మరియు ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి; అలాగే పీజీతో పాటు సెట్, నెట్, పీహెచ్‌డీ అర్హతలు కలిగి ఉండి, బోధనా అనుభవం ఉన్న వారికి నియామకంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అర్హత మరియు ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలతో తేదీ 24-07-2026 సాయంత్రం 4:00 గంటల లోపు కళాశాలలో నేరుగా సంప్రదించి దరఖాస్తులు సమర్పించవలసి ఉంటుందని, ఇంటర్వ్యూ తేదీని తదుపరి ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు; మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు 9490536839 ఫోన్ నెంబర్‌లో సంప్రదించగలని తెలిపారు.



# బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీస్

**పోక్సో కేసు నమోదు చేసి కానిస్టలేబుల్ అరెస్ట్**

**నల్లగొండ,**

బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడని ఓ పోలీస్ కానిస్టేబుల్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ మేరకు గుర్రంపోడ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణను నల్గొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల సైకిల్‌పై వెళ్తున్న ఓ బాలికను నిందితుడు అడ్డగించి, ఆమెతో అసభ్యంగా వ్యవహరించాడు. అనుచితంగా తాకి వేధించాడు. ఇంటికి వెళ్లాక బాలిక ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. వారు వెంటనే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచొద్దు..కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, జూలై20 ( అక్షర కలం ):

ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రమిశ్రా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా.. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 313 దరఖాస్తులు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 100 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 30 రోజులకు పైబడి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కోర్టు కేసులు, సీఎం ఆఫీస్, ట్విట్టర్లో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను లాగిన్ లో అప్డేట్ చేయాలని అధికారులకు సూచించారు.

# ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష

**-జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ**

**సమీక్ష సమావేశంలో పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పలు అంశాలను ప్రస్తావించారు.**




వనపర్తి జూలై 20 ప్రతినిధి అక్షర కలం వై రమేష్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల పురోగతి తదితర అంశాలపై మహబూబ్నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర ఆరోగ్య శాఖ మాత్యులు దామోదర రాజనర్సింహ అధ్యక్షతన సమావేశ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలు తీరు, వివిధ శాఖల పనితీరు, తాగునీటి సరఫరా, వ్యవసాయ రంగ పరిస్థితులు, వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, ఆరోగ్య సేవలు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, రహదారుల అభివృద్ధి, తక్షణ ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై శాఖల వారీగా సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగవంతంగా,పారదర్శకంగా అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ఎల్నినో కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి, నాగర్ కర్నూలు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, గద్వాల్ ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, అనిరుద్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్ పర్సన్ సరిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# షిఫా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి

గద్వాల జిల్లా కేంద్రంలోని 2వ రైల్వే గేట్ సమీపంలో నూతనంగా షిఫా మల్టీ స్పెషాలిటీ, చిల్డ్రన్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.నూతన షిఫా మల్టీ స్పెషాలిటీ, చిల్డ్రన్స్ హాస్పిటల్ ను ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగినది.ఎమ్మెల్యేకి, చైర్పర్సన్ కి డాక్టర్ యం.డి . షఫీక్ శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే హాస్పిటల్ లో ఆపరేషన్ థియేటర్, వైద్య పరికరాలను పరిశీలించారు.అనంతరం డాక్టర్ షఫీ కుమార్తె జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో కేక్ కటింగ్ చేశారు. ఎమ్మెల్యే చిన్నారికి కేకు తినిపించి జన్మదిన శు భాకాంక్షలు తెలిపి ఆశీర్వదించడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల ప్రాంతం దినదిన అభివృద్ధి చెందుతుందని, కొత్త టెక్నాలజీతో ప్రజలు వివిధ రకాల ఆరోగ్య సమస్యలపైన హైదరాబాద్ కర్నూల్ వంటి ప్రాంతాలకు వెళ్లి చికిత్సలు పొందేవారు. కానీ ఇప్పుడు గద్వాలలో అన్ని రకాల రోగాలకు సంబంధించిన హాస్పిటల్, ప్రజలకు అందుబాటులో అన్ని రకాల సౌకర్యాలు లభిస్తున్నాయి అని తెలపారు.




భవిష్యత్తులో గద్వాల నియోజకవర్గం వ్యాపారం సంస్థలో రావాలి, గద్వాల నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్,మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్,కౌన్సిలర్స్ బాబర్, రామలింగేశ్వర కాంప్లే, చంద్రశేఖర్, నాయకులు సాయి శ్యామ్ రెడ్డి,మాజీ కౌన్సిలర్స్ మురళి, నరహరి శ్రీనివాసులు, పూడూర్ కృష్ణ, మహేష్, నరహరి గౌడ్, మాజీ ఆలయం కమిటీ చైర్మెన్ సతీష్, గోవిందు, ఆనంద్ గౌడు, వెంకటేశ్వర్ రెడ్డి, బంగి సుదర్శన్, రిజ్వాన్, ప్రవీణ్, నాగేంద్ర యాదవ్, ధర్మ నాయుడు, గంట రమేష్, కొత్త గణేష్, వీరేష్ చిరు, షాషా,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్యంలో విడాకులు.. ఎందుకిలా?

## జీవితాంతం కలిసుండాలని చేసిన ప్రమాణాలు... చివరికి కోర్టు మెట్లెక్కడం ఎందుకు?

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 20:

ఒకప్పుడు వివాహం అంటే జీవితకాల బంధం. సుఖంలోనూ, కష్టంలోనూ ఒకరికొకరు అండగా నిలబడతామనే నమ్మకం. పిల్లలను పెంచి, వారి భవిష్యత్తును తీర్చిదిద్ది, కుటుంబ బాధ్యతలను పూర్తి చేసిన తర్వాత ప్రశాంతమైన వృద్ధాప్యాన్ని గడపాలని ప్రతి దంపతులు కలలు కంటారు. కానీ నేడు ఆ దృశ్యం కొంత మారుతోంది. 60, 70 ఏళ్ల వయస్సులో కూడా భార్యాభర్తలు విడాకుల కోసం కుటుంబ న్యాయస్థానాలను ఆశ్రయించడం పెరుగుతున్న ఆందోళనకర పరిణామం. ఇది కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, కుటుంబ వ్యవస్థ, సామాజిక విలువలు, భావోద్వేగ సంబంధాల్లో వస్తున్న మార్పులకు కూడా ఇది అద్దం పడుతోంది.



వృద్ధాప్యంలో విడాకులు -- పెరుగుతున్న ధోరణి

గతంలో విడాకులు ప్రధానంగా యువ దంపతుల మధ్యే కనిపించేవి. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉంది. 30, 40 ఏళ్ల వైవాహిక జీవితాన్ని గడిపిన దంపతులు కూడా చివరి దశలో విడిపోవాలని నిర్ణయించుకుంటున్నారు. దీనిని సామాజిక శాస్త్రవేత్తలు “గ్రే డివోర్స్ “ అని పిలుస్తున్నారు.

పిల్లలు స్థిరపడిన తర్వాత, ఎన్నో సంవత్సరాలుగా మనసులో దాచుకున్న అసంతృప్తి బయటకు రావడం, పరస్పర అనుబంధం తగ్గిపోవడం, భావోద్వేగ దూరం పెరగడం వంటి కారణాలతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది.

ప్రధాన కారణాలు ఏమిటి?

దశాబ్దాలుగా పేరుకుపోయిన మనస్పర్థలు,

చిన్నచిన్న గొడవలు, అపార్థాలు, బాధలు సంవత్సరాల తరబడి మనసులోనే ఉండిపోతాయి. పిల్లల భవిష్యత్తు కోసం వాటిని భరిస్తారు. కానీ చివరికి సహనం కోల్పోయి విడిపోవాలని నిర్ణయించుకుంటారు.

పిల్లల కోసం మాత్రమే కొనసాగిన వివాహం

చాలామంది దంపతులు పిల్లలు చిన్నవాళ్లు కావడం వల్ల విడాకులు తీసుకోరు. పిల్లలు ఉద్యోగాలు, వివాహాలు చేసుకుని తమ జీవితాల్లో స్థిరపడిన తర్వాత ఇక కలిసి జీవించాల్సిన అవసరం లేదని భావిస్తారు.

పరస్పర గౌరవం లేకపోవడం

ప్రేమ తగ్గినా కుటుంబం కొనసాగుతుంది. కానీ గౌరవం తగ్గితే బంధం నిలవడం కష్టం. ఒకరిని మరొకరు అవమానించడం, చిన్నచూపు చూడడం, మాటలతో బాధపెట్టడం వృద్ధాప్యంలో మరింత తీవ్రంగా అనిపిస్తుంది.

భావోద్వేగ నిర్లక్ష్యం

వృద్ధాప్యంలో శారీరక అవసరాల కంటే మానసిక తోడు ఎంతో ముఖ్యం. మాట్లాడుకునే మనిషి లేకపోవడం, ఆప్యాయత లేకపోవడం, ఒంటరితనం పెరగడం కూడా విడాకులకు దారితీస్తుంది.

ఆస్తి వివాదాలు

పిల్లల మధ్య ఆస్తి పంపకం, విల్లు, కుటుంబ సభ్యుల జోక్యం వంటి అంశాలు భార్యాభర్తల మధ్య విభేదాలను పెంచుతాయి.

ఆర్థిక స్వతంత్రం

గతంతో పోలిస్తే నేడు మహిళలు కూడా ఆర్థికంగా స్వతంత్రంగా ఉంటున్నారు. అందువల్ల అసంతృప్తికరమైన వివాహ జీవితాన్ని కొనసాగించాలనే ఒత్తిడి తగ్గింది.

కుటుంబ విలువల్లో మార్పు

ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయి అణు కుటుంబాలు పెరగడంతో పెద్దల సలహాలు, రాజీ ప్రయత్నాలు తగ్గిపోయాయి. చిన్న సమస్యలు కూడా పెద్ద వివాదాలుగా మారుతున్నాయి.

చట్టం ఏమి చెబుతోంది?

భారతదేశంలో వయస్సుతో సంబంధం లేకుండా, చట్టబద్ధ కారణాలు ఉంటే భార్యాభర్తలు విడాకులు కోరవచ్చు. క్రూరత్వం, విడిగా నివసించడం, వ్యభిచారం, మానసిక అనారోగ్యం వంటి కారణాలతో పాటు పరస్పర అంగీకారంతో కూడా విడాకులు పొందే అవకాశం ఉంది.

అయితే కుటుంబ న్యాయస్థానాలు ముందుగా సయోధ్యకు ప్రాధాన్యం ఇస్తాయి. సాధ్యమైనంత వరకు కుటుంబాన్ని కాపాడే ప్రయత్నం చేస్తాయి. ముఖ్యంగా వృద్ధ దంపతుల విషయంలో రాజీ అవకాశాలను పరిశీలిస్తాయి.

విడాకుల ప్రభావం

వృద్ధాప్యంలో విడాకులు కేవలం ఇద్దరి జీవితాలనే కాదు, మొత్తం కుటుంబాన్ని ప్రభావితం చేస్తాయి.

పిల్లలు మానసికంగా బాధపడతారు.

మనవలు, మనవరాళ్లపై కుటుంబ విభేదాల ప్రభావం పడుతుంది.

ఒంటరితనం, ఆందోళన, ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది.

ఆస్తి వివాదాలు మరింత క్లిష్టమవుతాయి.

సమాజంలో కూడా కుటుంబ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతాయి.

పరిష్కారం ఏమిటి?

విడాకులు ప్రతి సమస్యకు పరిష్కారం కావు. సమస్యలను మాట్లాడుకోవడం, పరస్పరం వినడం, అవసరమైతే కుటుంబ సభ్యులు, పెద్దలు లేదా కౌన్సిలర్ల సహాయం తీసుకోవడం మంచిది.

ఒకరినొకరు గౌరవించాలి

చిన్న విషయాలను పెద్దవిగా మార్చకూడదు.

క్షమించే గుణాన్ని పెంపొందించుకోవాలి.

వృద్ధాప్యంలో ఒకరికొకరు తోడుగా ఉండే బాధ్యతను గుర్తుంచుకోవాలి.

ముగింపు

వివాహం అనేది కేవలం ఇద్దరి వ్యక్తుల ఒప్పందం కాదు; అది రెండు కుటుంబాలను కలిపే పవిత్ర బంధం. జీవితంలోని తొలి అడుగుల నుంచి చివరి శ్వాస వరకు ఒకరికొకరు తోడుగా ఉండటమే వివాహం యొక్క అసలు సారాంశం.

వృద్ధాప్యంలో విడాకులు తీసుకోవాల్సిన పరిస్థితి వస్తే, దానికి వెనుక ఉన్న బాధను సమాజం కూడా అర్థం చేసుకోవాలి. అదే సమయంలో, సంభాషణ, గౌరవం, సహనం, ప్రేమ అనే నాలుగు విలువలను కాపాడగలిగితే అనేక కుటుంబాలు నిలబడతాయి.

వృద్ధాప్యం విడిపోవాల్సిన వయస్సు కాదు... ఒకరి చేతిని మరొకరు మరింత గట్టిగా పట్టుకోవాల్సిన వయస్సు. బంధాన్ని నిలబెడితేనే జీవితం నిలుస్తుంది.



**ఫ్యామిలీ కౌన్సిలర్ సఖ్యత -వన్ స్టెప్ సెంటర్, అడ్వకేట్ రాజలింగు మోతె 9676761221)**

# కాళేశ్వరం జలాలతో ఆరు సంవత్సరాలుగా పంటలు పండుతుంటే కాంగ్రెస్‌కు కనిపించడం లేదా? బీఆర్ఎస్ నాయకుల విమర్శ



అక్షర కలం సిద్దిపేట జూలై 20:

చిన్నకోడూరు మండల రైతుల ప్రయోజనాల కోసం నిర్వహించిన రైతు పాదయాత్రకు వేలాది మంది రైతులు స్వచ్ఛందంగా హాజరయ్యారని, అయినప్పటికీ కాంగ్రెస్ నాయకులు ఆ స్పందనను విస్మరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు.సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాముని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మిడ్ మానేరు, అన్నపూర్ణ సాగర్, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ వంటి జలాశయాల ద్వారా రైతులకు సాగునీరు అందించి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించే పరిస్థితిని బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు.రైతు బంధు పథకాన్ని అమలు చేసి రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు. మిగిలిన నీటి పారకం కాల్వలను పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం సాగుకు అందిస్తున్న నీరు కూడా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే వస్తోందని పేర్కొంటూ, అలాంటి ప్రాజెక్టును విమర్శించడం సరికాదన్నారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన మాజీ మంత్రి హరీష్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. రైతు ప్రయోజనాలను కాపాడడమే తమ లక్ష్యమని, రైతు వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని వారు పేర్కొన్నారు.బీఆర్ఎస్ పార్టీపై రైతులు చూపిస్తున్న ఆదరణను చూసి కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగడం బాధాకరం. నిన్న విజయవంతంగా నిర్వహించిన రైతుల మహా పాదయాత్రకు లభించిన విశేష స్పందనను జీర్ణించుకోలేక బీఆర్ఎస్ పార్టీ, హరీష్ రావు మరియు ఇతర నాయకులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం తగదు.అంతేకాకుండా, మహా పాదయాత్రలో పాల్గొన్న రైతులను అవమానించేలా మాట్లాడటం అత్యంత ఖండనీయమైనది. రైతుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాము.ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా, నిజంగా రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా సిద్ధిపేట నుండి ఇల్లంతకుంట వరకు రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలి. అదేవిధంగా రంగనాయకసాగర్, అంతగిరి ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నింపి రైతులకు సాగునీరు అందించాలి. విద్యుత్ కోతలను నివారించాలి. ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి. గత రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ చిన్నకోడూరు మండలంలో కాలువల నిర్మాణం, భూసేకరణ వంటి కీలక అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించకపోవడం విచారకరం.భవిష్యత్తులో కూడా రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ, ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్యబద్ధంగా రైతులతో కలిసి పోరాటాలు నిర్వహించి, సమస్యలు పరిష్కరించే వరకు ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరిస్తున్నాము.ఇట్టి కార్యక్రమంలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కొండం రవిందర్ రెడ్డి, కాముని ఉమేష్ చంద్ర, కాల్వ ఎల్లం, రేగుల దేవయ్య, నాగార్జున రెడ్డి, నముండ్ల హరీష్, ముసిమిరి సాయి, పంపరి కనకయ్య, బంక పోషయ్య, ఏదుల రాజి రెడ్డి, బంక రాజు, కనకయ్య తదితరులు ఉన్నారు.

# ఉద్యమంలా 'తెలంగాణ జలసిరి' కార్యక్రమం చేపట్టాలి

**ఊరూరా ఇంకుడుగుంతలు, ఊట కుంటలు నిర్మించాలి -- కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్, జూలై 20 ( అక్షర కలం ):

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు పిలుపునిచ్చారు. వీబీజీ రామ్-జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ జలసిరి పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, డీఆర్డీఓ గీతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాలని అన్నారు. వీబీజీ రామ్-జీ పథకం కింద ప్రభుత్వం ఇంకుడుగుంతలు, పంట కుంటలు, ఊట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ పనులు చేపడుతోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన గ్రామాభివృద్ధి లక్ష్యంగా వీబీజీ రామ్-జీ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యానవన, భూగర్భ జలాలు, గనులు-భూగర్భ శాస్త్రం, మత్స్య, ప్రణాళిక, విద్యుత్ శాఖలతో పాటు స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణం) అధికారులు పరస్పర సహకారంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వాహనదారుల అవస్థలు



వీణవంక, జూలై20 ( అక్షర కలం ) :

వీణవంక మండలం బేతిగల్ గ్రామంలోని ఊరు చెరువు మత్తడి వద్ద ఉన్న కల్వర్టు తీవ్ర ప్రమాదకరంగా మారింది. ప్రయాణానికి అత్యంత కీలకమైన ఈ కల్వర్టుపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ?ఈ మార్గం గుండా జగ్గయ్యపల్లి మరియు జమ్మికుంట ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే, కల్వర్టుపై ఏర్పడిన గుంతల వల్ల వాహనాలు దెబ్బతినడమే కాకుండా, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ గుంతలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు..

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# కాళేశ్వరం... ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం !

దొంగలుపడ్డ ఆరు నెలలకు ...అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచారణకు ఓ కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూపించ లేకపోయారు. కాళేశ్వరం, ధరణి, ఈ కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. కేవలం బిఆర్ఎస్‌పై రాజకీయంగా పైచేయి సాధించేందుకు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాళేశ్వరం కూలేశ్వరం అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచు కూడా ముందుకు కదలలేదు. లక్షకోట్లు పెట్టిన ప్రాజెక్ట్ పడావు పడ్డది. దానిని ఎలాగైనా వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు లేకుండా పోయింది. ఎంతసేపు రాజకీయంగా విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన అవినీతిపై ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని కేవలం రాజకీయంగా ఉపయోగించు కుని బిఆర్ఎస్‌ను భ్రష్టు పట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ పల్లవి అందుకున్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వినిగింలోకి ఎలా తేవడం అన్న ఆలోచన పక్కన పెట్టారు. అందుకే నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా



ఉపయోగించుకోవాలన్నది ఆలోచించడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలింపు అసాధ్యమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగడంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మోటర్లు, కాలువలు అంతా వృధా అవుతున్నాయి. ఇదే విషయాన్ని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ప్రస్తావిస్తే.. ఆయనను బిఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణించి విమర్శలతో దాడి చేశారు. నిజానికి గత 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అక్రమాలు ప్రధాన భూమిక పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేకానేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డదన్నట్లుగా సాగుతున్నారు. పదికాలాలపాటు పనికి వచ్చే పనులు చేయడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరిం చాలన్న దానిమీద సరైన అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్ధరించే ప్రయత్నాలు చేసి, నీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చివుంటే, ఈయేడు మంచి ఫలితాలు వచ్చేవి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టను ఉపయోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఆ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డామ్ సేఫ్టి అథారిటి చెప్పిందని, అందువల్ల అక్కడ నీటిని వినియోగంలోకి తసీఉకుని రావడం అసాధ్యమని చెబుతున్నారు. కాళేశ్వరం ఎటిఎంగా మారిందని గతంలో బిజెపి కూడా ఆరోపించింది. రేవంత్ రెడ్డి కూడా ఇదే ప ÷-రచారం చేశారు. పోనీ అలాగని ఇందులో జరిగిన అవినీతిని వెలికితీసి కెసిఆర్ తదితరులను దోషులుగా నిలబెట్టి ఉంటే రేవంత్ ఇమేజ్ పెరిగేది. కానీ ఆరోపణలతోనే రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ రిపోర్టుపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను అరెస్టు చేస్తారేమో అన్నంతగా ప్రచారం జరిగింది. అంతా తుస్సుమంది. ఇప్పుడు కమిషన్ రిపోర్టుకు కూడా పెద్ద విలువ లేకుండా పోయిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు బారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నీరు నిల్వచేసి పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని తోడి ఆయా ప్రాంతాలలో ఉన్న రిజర్వాయిర్‌లను నింపాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇందుకు రేవంత్ ససేమిరా అనడంతో చంద్రబాబు కోసం గోదావరి జలాలలను కిందికి జారవిడుస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు నీరు ఎలా ఇవ్వవచ్చా అన్నదానిపై ఆలోచన చేసి ఉండాల్సింది. కేసీఆర్ కట్టించినంత మాత్రాన ఆ ప్రాజెక్టు కెసిఆర్‌ది అయిపోదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇప్పుడు రాజకీయంగా రేవంత్‌ను ఏకిపారేయడంలో బిఆరెస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. మంత్రులు అవినీతిలో కూరుకు పోయారని కెటిఆర్, హరీష్ రావులు రోజూ విమర్శలు చేస్తున్నారు. కమిషన్లు లేనిదే మంత్రులు కాలు బయటపెట్టడం లేదని అంటున్నారు. ఈ ఎదురుదాడితో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రకంగా ఆత్మరక్షణలో పడిపోయింది. సింగరేణి తదితర విషయాల్లో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. ఈ క్రమంలోనే వాదోపవాదాలు, విమర్శ, ప్రతి విమర్శలతో రాజకీయ వేడెక్కింది. అవినీతి అంటూ ఆరోపించిన రేవంత్ నిరూపించలేదు. దీనికి బదులుగా కేటీఆర్, హరీష్‌రావులే గట్టిగా బదులు ఇస్తున్నారు. దీనివల్ల కూడా రేవంత్ అసహనానికి గురి అవుతున్నారనిపిస్తోంది. ఒక వేళ నిజంగానే గోదావరి నీటిని లిఫ్ట్ చేయడంలో ఇబ్బంది ఉంటే, ఎన్‌డిఎస్ఎ నివేదికపై అఖిలపక్షం నిర్వహించి చర్చ చేయాలి. బారేజీల వద్దకు, పంప్ హౌస్‌ల వద్దకు రిటైర్డ్ ఇంజనీర్లను తీసుకునివెళ్లి ఇరిగేషన్ అధికారుల ద్వారా పరిస్థితిని వివరించాలి. కానీ ఇవేవీ చేయకపోవడంతో ఇప్పుడు కాళేశ్వరమే బిఆర్ఎస్‌కు ఆక్సిజన్ నింపుతోంది.

# ఎల్‌నినో ప్రభావం మెదక్ జిల్లాలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహణ తీరు బేష్....- మంత్రి వివేక్ వెంకటస్వామి.....

**మెదక్/ కొల్చారం జులై 20(అక్షర కలం):-**

ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు గ్రామ గ్రామానా అవగాహన సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎల్‌నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై సంగారెడ్డి- మెదక్ జిల్లా సమీక్ష సమావేశం తెలంగాణ రాష్ట్రానికి కార్మిక, ఉపాధి కల్పన, ఫ్యాక్టరీలు మరియు గనుల శాఖల మంత్రి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి అధ్యక్షతన జరిగింది. టూరిజం శాఖ ప్రధాన కార్యదర్శి ,మెదక్ జిల్లా ప్రత్యేక అధికారి వాణి ప్రసాద్ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పత్రిక్ జైన్ , మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి ,నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ,ఎమ్మెల్యే నారాయణఖేడ్ సంజీవరెడ్డి,జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్యరావు ఎమ్మెల్యే సంగారెడ్డి చింత ప్రభాకర్ , సబ్ కలెక్టర్ నారాయణఖేడ్ ఉమా హారతి అదనపు ఎస్పీ సంగారెడ్డి చైతన్య ఇది జిల్లాల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇరిగేషన్, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు



తక్కువగా నమోదవుతాయని ఈ పరిస్థితుల్లో రైతాంగం ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం చేస్తున్నట్లు అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలన్నారు వ్యవసాయ ఉద్యాన వన అధికారుల సమన్వయంతో
అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి రైతుకు భూగర్భ జలాల పరిస్థితి, సాగునీటి లభ్యత, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, వర్షాభావ పరిస్థితులపై స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు..

- నర్సాపూర్ శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి......

నర్సాపూర్ శాసన సభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎల్ నీ .నో పై అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. కోతుల బెడద ఎక్కువగా ఉండటంవల్ల వాటి నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు పంట నష్టం జరిగిన రైతులకు, నష్టపోయిన రైతులకు, కొంత నష్ట పరిహారం చెల్లించాలన్నారు. 25 వేల రూపాయలు ఎకరానికి అందించే విషయాన్ని కేబినెట్లో చర్చించాలన్నారు.

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి....ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ సింగూరు డ్యాం మరమ్మతుల కోసం అన్ని నీటిని విడుదల చేయడం జరిగిందని, ఎనిమిది టిఎంసిలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులను, త్రాగునీటిని దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంగళ్ పాండే జయంతి వేడుకలు

**మందమర్రి, జూలై 20 అక్షర కలం:**

భారత ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు మంగళ్ పాండే జయంతి వేడుకలు రిటైర్డ్ ఆర్మీ జవాన్ రాజేష్ కుమార్ పివ్వాల్ రాణి పివ్వాల్ ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తమ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంగళ్ పాండే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్ లోని బల్లియా జిల్లాలో జన్మించిన మంగళ్ పాండే 1857 సిపాయిల తిరుగుబాటుకు (మొదటి స్వాతంత్ర్య సంగ్రామం) ఆద్యుడిగా, బ్రిటిష్ పాలనపై



తొలిసారిగా సాయుధ తిరుగుబాటు చేసిన యోధుడిగా ఆయన దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని ఆయన సేవలను కొనియాడారు. బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ సైన్యంలో (34వ బెంగాల్ స్థానిక పదాతిదళంలో) సైనికుడిగా పనిచేసిన ఆయన ఆవు, పంది కొవ్వుతో తయారు చేసినట్లు ఆరోపణలు ఉన్న 'ఎన్‌ఫీల్డ్' తూటాలను ఉపయోగించడానికి నిరాకరించి, మార్చి 29, 1857న బరాక్‌పూర్‌లో బ్రిటిష్ అధికారులపై ఆంగ్లేయ సైన్యంలో హవాల్దార్ గా పనిచేస్తున్న మాత దిన్ వాల్మీకి తో కలిసి తిరుగుబాటు జెండా ఎగురవేశారన్నారు. బ్రిటీష్ సైనికులు ఉపయోగించే తూటాలకు ఆవు, పందికొవ్వును పూస్తున్నారని ఆయనకు వివరించి తిరుగుబాటు చేసిన గొప్ప దేశభక్తులని అన్నారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి ఆయనను ప్రేరేపించి తిరుగుబాటు చేశారన్నారు. బ్రిటిష్ అధికారులపై ధిక్కారం కారణంగా మంగళ్ పాండే ను ఏప్రిల్ 8, 1857న బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసిందన్నారు. విద్యార్థులకు స్వాతంత్ర సమరయోధుల పోరాట గాథలు వివరించేందుకే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి వారిలో దేశభక్తిని పెంపొందించే చర్యలు చేపడుతున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన

**మందమర్రి, జూలై 20 అక్షర కలం:**



పట్టణంలోని 2వ జూన్ లో గల ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంలో డాక్టర్ జాహ్నవి ఆధ్వర్యంలో సోమవారం హాస్టల్ విద్యార్థులకు వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జాహ్నవి మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులందరూ జాగ్రత్త వహించాలని, వర్షాకాలం సమయంలో డెంగ్యూ, మలేరియా, చర్మవ్యాధులు రాకుండా తడి దుస్తులను ధరించకూడదని, బయట లభించే ఆహారాన్ని తీసుకోకూడదని సూచించారు. శరీరంలో ఏదైనా సమస్య అనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదిస్తే వ్యాధి ప్రారంభమై మొదటి దశలోని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ హైమావతి

**అక్షర కలం, సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జులై 20 :**

దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని ఏఎన్ఎం ఎన్సిడి



స్క్రీనింగ్ చేస్తున్నారా, సీజనల్ వ్యాధులకు సంబంధించి శానిటేషన్ డ్రైవ్ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఓపి ఎంత, అందరూ సమయ వేళలు పాటిస్తున్నారా అని మెడికల్ ఆఫీసర్ ను అడగ్గా, రోజు ఉదయం సాయంత్రం వేళల్లో రోగుల తాకిడి ఉంటుందని సమయ వేళలు పాటిస్తున్నామని మెడికల్ ఆఫీసర్ కలెక్టర్ కి తెలిపారు. రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించేలా పనిచేయాలని మెడికల్ ఆఫీసర్ మరియు సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన బాలికతో ఏమైంది, ఎందుకొచ్చావమ్మ అని జిల్లా కలెక్టర్ పలకరించగా 5 రోజుల నుండి జ్వరం వస్తుందని తగ్గడం లేదని చింతమడక మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్లు సూచించిన మెడిసిన్ క్రమం తప్పకుండా వాడుకోవాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని వేడిగా ఉన్నపుడే ఆహారం తీసుకోవాలని, అధైర్య పడవద్దని త్వరలోనే తగ్గుతుందని జిల్లా కలెక్టర్ సూచించారు. చింతమడక మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలలో బాలికలకు 5 రోజులుగా జ్వరం వస్తున్నాయని గురుకులంలో ఫీవర్ సర్వే జరపాలని డిఎంఅండ్‌హెచ్ఓను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఫోన్ ద్వారా ఆదేశించారు.

## పాదయాత్ర అట్టర్ ఫ్లాప్

**పాదయాత్ర లో కనిపించని హరీష్ రావ్**

**పైసలు పంచలేదని పోచమ్మ దగ్గర**

**ప్రమాణం చేసే దమ్ముందా**

**ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్**

**అక్షర కలం సిద్దిపేట జూలై 20:**

గోదావరి జలాలు వదలాలని బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహా పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయిందని మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ అన్నారు. హరీష్ రావు అనుచరులు తప్ప రైతులెవరూ లేరన్నారు. అంతో



ఇంతో హాజరైన మహిళలకు ఐదు వందల రూపాయలు ఇచ్చారని ఆరోపించారు. పాదయాత్ర కు హాజరైన వాళ్ళకు డబ్బులు ఇవ్వలేదని అంతగిరి పోచమ్మ తల్లి మీద ఒట్టేస్తారా అని ప్రశ్నించారు. అల్లిపూర్ లో రైతులు అడ్డుకుంటారని తెలిసి హరీష్ రావు రంగనాయక సాగర్ వద్ద హాజరయ్యారన్నారు. రైతు యాత్ర లో రైతు సమస్యలు వింటూ రైతులతో పాదయాత్ర చేయకుండా నయ నిజాం లాగా సమయానికి రంగనాయక సాగర్ మీదకు వచ్చి వునకదంపుడు ఉపన్యాసాలు పెట్టడం సిగ్గుచేటన్నారు, ఇది తమ ఉనికి కోసం పాటుపడే పాదయాత్ర అని అందుకే అందులో రైతులెవరూ లేరన్నారు. అల్లీపూర్ నుండి పాదయాత్ర కు నాయకత్వం వహించిన రాధా కృష్ణ శర్మ ముందుగా తన సొంత గ్రామంలో ఉన్న కొత్త కుంట, గాండ్ల కుంట, కశిరు కుంట,దుబ్బ కుంట, పితిరి కుంటాలకు నీళ్లు ఇచ్చి మాట్లాడాలన్నారు,కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాల్ లక్ష్మి, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, నాయకులు గొట్టిపర్తి చందు, చింతల రాజు పాల్గొనడం జరిగింది.

## దివ్యాంగులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం


**అక్షర కలం సిద్దిపేట జూలై 20:**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పై తెలంగాణ దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అర్హులని వదిలేసి అనా హూరులకి పరికరాలు స్కూటీలు బ్యాటరీ ట్రై సైకిల్స్ బిజినెస్ వెహికల్స్ బిజినెస్ ఆటో లు అన్నీ కూడా నిజమైన అర్హులకి అందకుండా అనర్హులకి పంపిణీ చేసిన విషయం తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం అధ్యక్షులు కెమ్మసారం అశోక్ దృష్టికి వచ్చింది కావున అధికారులు మరియు వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ లేదా వికలాంగుల శాఖ మంత్రివర్యులు వెంటనే యాక్షన్ తీసుకొని ఎడల నిజమైన అర్హులతో సచివాలయం ముట్టడించి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒకరికే స్కూటీ ఒకరికే బిజినెస్ ఆటో ఎలా ఇచ్చారు అని దానిపై సీఎం రేవంత్ రెడ్డి తో ముఖాముఖి చర్చకు దిగుతానని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగులు స్వేచ్ఛ సంఘం అధ్యక్షులు కెమ్మసారం అశోక్ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి సూటిగా హెచ్చరిస్తూ డిమాండ్ చేస్తున్నాను లేని ఎడల దివ్యాంగుల కోసం ఎంత దూరమైనా పోరాడుతానని దివ్యాంగుల కై నా ప్రాణమైన అర్పిస్తానని డిమాండ్ చేస్తూ వెంటనే 33 జిల్లాలో ఉన్న అధికారులు కూడా డి డబ్ల్యూ గార్లు మీరు ఎవరికి ఏమేమి వెహికల్స్ ఇచ్చారు మీ రికార్డ్స్ లో ఉంటాయి అది మాత్రం సరి చేసుకుని ఎడల మీ ఉద్యోగం పోవడం ఖాయం ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో పైనుండి మొదలుకొని కిందిస్థాయి నాయకుల వరకు ఇలాంటి అన్యాయాలు జరుగుతూనే ఉన్నాయి ఇకనైనా బుద్ధి తెచ్చుకుని నిజమైన అర్హులకి వెహికల్స్ అందజేయాలని కోరుకుంటూ రెండుసార్లు తీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోగలరని కోరుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకులని మరియు అధికారులని మరియు దివ్యాంగుల శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మరియు 33 జిల్లాల కలెక్టర్లని మరియు 33 జిల్లాల్లో ఉన్న డి డబ్ల్యూ లని హెచ్చరిస్తూ డిమాండ్ చేస్తున్నాను ఒకవేళ అధికారులు నన్ను ఎక్కడ మేము తప్పు చేసాము అని అడిగినా కానీ మేము రాష్ట్రంలో ఎక్కడ మీరు తప్పు చేశారో చూపించండి అని అన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# మైదానంలో తీవ్ర ఉద్రిక్తత

## అర్జెంటీనా ప్లేయర్ తలపై కొట్టిన ఇంగ్లాండ్ స్టార్

ఫిఫా వరల్డ్ కప్ 2026 రెండో సెమీఫైనల్ మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో ఊహించని షాకింగ్ డ్రామా నడిచింది. అర్జెంటీనా చేతిలో 2-1 తేడాతో ఇంగ్లాండ్ ఘోర పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే, రెఫరీ ఫైనల్ విజిల్ వేసిన వెంటనే, మ్యాచ్‌ను గెలిచిన ఆనందంలో అర్జెంటీనా ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా, ఇంగ్లాండ్ స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ఓటమి భారంతో కోపంతో ఊగిపోయిన బెల్లింగ్‌హామ్, ఒక అర్జెంటీనా ఆటగాడి వద్దకు వెళ్లి అతడి తలపై కొట్టాడు. దీంతో మైదానంలో ఒక్కసారిగా ఉత్కంఠ, ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. నిజానికి మ్యాచ్ చివరి నిమిషం వరకు ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య తీవ్రమైన పోటీ నడిచింది. చివరి నిమిషాల్లో కమ్ బ్యాక్ ఇచ్చిన అర్జెంటీనా.. వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. దీంతో ఇంగ్లాండ్ ఆటగాళ్లు తీవ్ర ఒత్తిడి, నిరాశకు గురయ్యారు. మ్యాచ్ ముగిశాక అర్జెంటీనా ఆటగాళ్ల సంబరాలు స్లెడ్జింగ్ బెల్లింగ్‌హామ్‌కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించినట్లు తెలుస్తోంది. దీంతో సహనం కోల్పోయిన జూడ్.. అర్జెంటీనా ఆటగాడు బార్కో తలపై కొట్టాడు. బార్కో ఏదో అన్న తర్వాతే జూడ్.. కొట్టినట్లు తెలుస్తోంది. ఇది జరిగిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లు వెంటనే బెల్లింగ్‌హామ్‌ను చుట్టుముట్టారు. దాంతో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య పెద్ద ఎత్తున తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. మైదానంలో వాతావరణం మరింత వేడెక్కడంతో వెంటనే మిగతా ఆటగాళ్లు.. కగలజేసుకుని, ఇద్దరికీ సర్ది చెప్పారు. ఇక ఇదే మ్యాచులో మెస్సీతోనూ ఓ దశలో ఇంగ్లాండ్ స్టార్ బెల్లింగ్‌హామ్ వాగ్వాదానికి దిగాడు. క్రికెట్‌లో భారత్, పాక్ మ్యాచ్ అంటే ఎంత క్రేజ్ ఉంటుందో.. ఫిఫా ప్రపంచకప్‌లోనూ అర్జెంటీనా, ఇంగ్లాండ్ మ్యాచ్‌కు అంతే క్రేజ్ ఉంది. ఫాక్ లాండ్ దీవుల కోసం 1982లో ఈ రెండు దేశాల మధ్య సుమారు 74 రోజుల పాటు ఘర్షణ జరిగింది. ఇంగ్లాండ్ పైచేయి సాధించడంతో.. అర్జెంటీనా సంధి కుదుర్చుకుంది. ఈ ఘర్షణల్లో ఇరు దేశాలకు చెందిన సుమారు 900 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఇది గుర్తుపెట్టుకున్న అర్జెంటీనా ఆటగాళ్లు మ్యాచ్ తర్వాత 'ఫాక్ లాండ్స్ అర్జెంటీనాదే' అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శించడం గమనార్హం. దీంతో ఈ విషయంపై ఇప్పటికీ రెండు దేశాల మధ్య వైరం కొనసాగుతోందని స్పష్టమైంది.

# పాకిస్థాన్ ఖాతాలో చెత్త రికార్డు!



క్రికెట్ మైదానంలో సున్నా పరుగులకే వెనుదిరగడం ఏ బ్యాటర్‌కైనా అత్యంత నిరాశపరిచే, ఇబ్బందికరమైన క్షణం. ఒకే వన్డే మ్యాచ్‌లో ఒకరిద్దరు ఘోరంగా వైఫల్యం చెందితేనే జట్టు తీవ్ర ఒత్తిడిలోకి వెళ్తుంది. అలాంటిది ఒకే ఇన్నింగ్స్‌లో ఏకంగా ఆరుగురు బ్యాటర్లు కనీసం పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరితే ఆ జట్టు పరిస్థితి అత్యంత ఘోరంగా మారుతుంది. వన్డే క్రికెట్ సుదీర్ఘ చరిత్రలో ఇలాంటి అవమానకరమైన రికార్డు ఇప్పటివరకు కేవలం ఆరు సార్లు మాత్రమే ప్రపంచ వ్యాప్తంగా నమోదైంది. ఈ అపఖ్యాతిని, అవాంఛిత రికార్డులను మూటగట్టుకున్న జట్లలో క్రికెట్ చరిత్ర కలిగిన పాకిస్థాన్ జట్టు అగ్రస్థానంలో నిలిచింది. ఒకే వన్డే ఇన్నింగ్స్‌లో అత్యధికంగా ఆరుగురు ఆటగాళ్లు డకౌట్ అయిన ఘోరమైన రికార్డును పాక్ క్రికెట్ జట్టు చరిత్రలో మూడు సార్లు నమోదు చేయడం విశేషం. ఈ అనామక జాబితాలో పాకిస్థాన్‌తో పాటు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్లు కూడా ఒక్కోసారి ఈ అత్యంత ఘోరమైన అవమానాన్ని చవిచూశాయి. ఈ అవమానకరమైన ప్రయాణాన్ని పాకిస్థాన్ జట్టు 1987 మే 25న ఇంగ్లాండ్‌తో బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన మ్యాచ్‌తో ఆరంభించింది. బర్మింగ్‌హామ్ వన్డేలో పాక్ జట్టులో ఆరుగురు ఆటగాళ్లు ఖాతా తెరవకుండానే ఔటయ్యారు. అయితే ఆరుగురు డకౌట్ అయినా ఆ మ్యాచ్‌లో పాక్ జట్టు 9 వికెట్ల నష్టానికి 213 పరుగులు సాధించడం విశేషం. ఆ తర్వాత 1993 ఫిబ్రవరి 25న కేప్‌టౌన్‌లో కేవలం 43 పరుగులకే కుప్పకూలిన మ్యాచ్‌లోనూ పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు బ్యాటర్లు సున్నా పరుగులకే వెనుదిరిగి మరోసారి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు.ఆ తర్వాత కాలంలో కూడా పాకిస్థాన్ బ్యాటింగ్ లైనప్ తన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ 2012 జూన్ 16న కొలంబో వేదికగా శ్రీలంకతో జరిగిన వన్డే మ్యాచ్‌లో మూడోసారి ఈ ఘోర పతనాన్ని చవిచూసింది. లంక నిర్దేశించిన లక్ష్య ఛేదనలో పాక్ జట్టు 199 పరుగులు చేసింది. అయినప్పటికీ ఈ ఇన్నింగ్స్‌లో కూడా ఆరుగురు ఆటగాళ్లు డకౌట్ కావడంతో వన్డేల చరిత్రలోనే అత్యధికంగా మూడు సార్లు ఈ దారుణమైన రికార్డును మూటగట్టుకున్న ఏకైక జట్టుగా పాకిస్థాన్ నిలిచింది. పాకిస్థాన్ కాకుండా ఇతర ప్రధాన దేశాల్లో బలమైన జట్టుగా పేరున్న దక్షిణాఫ్రికా కూడా ఈ చెత్త రికార్డును నమోదు చేసింది. 2002 జనవరి 22న సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియా చేతిలో జరిగిన మ్యాచ్‌లో ప్రొటీస్ జట్టు 106 పరుగులకే ఆలౌట్ కాగా..ఏకంగా ఆరుగురు బ్యాటర్లు సున్నాకే వెనుదిరిగారు. అనంతరం 2008 నవంబర్ 20న హరారే వేదికగా శ్రీలంకతో జరిగిన వన్డేలో జింబాబ్వే బ్యాటర్లు కూడా ఇదే తప్పును పునరావృతం చేస్తూ నిరాశపరిచారు. ఆ జట్టు కూడా కేవలం 127 పరుగులకే పరిమితం కాగా.. ఆరుగురు ఆటగాళ్లు సున్నా పరుగులతో డకౌట్‌గా వెనుదిరిగారు. ఈ చెత్త రికార్డు కలిగిన జట్ల జాబితాలోకి ఇటీవల యూఏఈ (యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్) సరికొత్తగా వచ్చి చేరింది. 2024 నవంబర్ 7న అల్ అమీరత్ వేదికగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో యూఏఈ ఘోర బ్యాటింగ్ వైఫల్యాన్ని చూపించింది. ఈ ముఖాముఖి పోరులో కేవలం 78 పరుగులకే ఆలౌట్ అయిన యూఏఈ జట్టులో సరిగ్గా ఆరుగురు బ్యాటర్లు సున్నా పరుగులకే పెవిలియన్ చేరి ఈ ఘోరమైన రికార్డుల క్లబ్‌లో తమ స్థానాన్ని స్థిరపరుచుకున్నారు. అర్థం చేసుకోవచ్చు. వన్డే క్రికెట్ చరిత్రను పరిశీలిస్తే ఇలాంటి అవమానకర ఫలితాలు కేవలం ఒక సాధారణ పరాజయంగా మాత్రమే మిగిలిపోవు.

# హెచ్ కోచ్ పదవికి హెన్రీచ్ మలాన్ రాజీనామా

టీ20 సిరీస్‌లో భారత్‌ను క్లీన్ స్వీప్ చేసి చరిత్రాత్మకమైన విజయం సాధించిన కొద్ది గంటల్లోనే ఐర్లాండ్ క్రికెట్ జట్టులో భారీ మార్పులు జరిగాయి. ఆ జట్టు హెచ్ కోచ్ హెన్రీచ్ మలాన్ కోచ్ పదవికి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ రాజీనామా తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. అయితే ఈ నిర్ణయానికి గల కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది. ఏదేమైనా భారత్?లాంటి బలమైన జట్టును 2-0తో క్లీన్ స్వీప్ చేసిన అనంతరం హెడ్ కోచ్ తన పదవికి రాజీనామా చేయడం మాత్రం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, రీసెంట్?గా భారత్ శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో ఐర్లాండ్ పర్యటనకు వెళ్లింది. ఈ టూర్?లో రెండు మ్యాచ్? టీ20 సిరీస్? ఆడింది. అయితే పసికూన ఐర్లాండ్ జట్టు తమ సొంతగడ్డపై వరల్డ్ ఛాంపియన్స్ భారత్?ను వరుసగా రెండు టీ20 మ్యాచ్?ల్లోనూ ఓడించి సరికొత్త చరిత్ర సృష్టించింది. క్రికెట్?లో ఫార్మాట్‌లోనైనా భారత్‌పై ఐర్లాండ్‌కు ఇదే తొలి సిరీస్ విజయం కావడం విశేషం. ఈ సిరీస్?లో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 34 పరుగులు తేడాతో ఓడిపోయింది. ఇక ఆదివారం జరిగిన రెండో టీ20లో ఒక్క పరుగు స్వల్ప తేడాతో పరాజయం పాలైంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA





# మహాప్రభు జగన్నాథ్ విడుదలపై స్టే

ఎలీ యానిమేషన్స్ సంస్థ నిర్మించిన మహాప్రభు జగన్నాథ్ చిత్రాన్ని శుక్రవారం రిలీజ్ చేయాల్సి ఉన్నది. కానీ ఆ ఫిల్మ్ రిలీజ్‌పై ఒడిశా హైకోర్టు స్టే విధించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలు అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ఇవాళ వెల్లడించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనాతో కూడిన ధర్మాసనం ఈ కేసులో అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.



# ఆగస్ట్ 15న రానున్న హుషారు పిట్టలు

అన్షు, వాసవి గణెళిషన్ కాంబోలో రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్రక్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి టోంగా టోంగా అనే ఓ హుషారు గీతాన్ని బుధవారం విడుదల చేశారు. చరణ్ అర్జున్ సంగీత దర్శకత్వంలో ఎస్.ఎస్.చిరంజన్ సాహిత్యంతో, మెయిన్ కొరియోగ్రఫీతో ఈ పాట తెరకెక్కింది. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదోదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు. అయితే ఇదే సినిమాను ఏ తమిళంలో, మలయాళంలో తీసి టీజర్‌ను విడుదల చేస్తే అందరూ ప్రశంసించేవారు. కానీ తెలుగు వాళ్ల మనకు చిన్న చూపు. తెలుగులో హుషార్ పిట్టలు ట్రెండ్ సృష్టించబోతుంది. విడుదల తరువాత ఇతర భాషల్లో ఈ తెలుగు సినిమా గురించి మాట్లాడుకుంటారు. పుట్ట చిట్టి పాత్రకు వాసవి ప్రాణం పోసింది. అందుకే ఆమె కాళ్లు మొక్కుతున్నాను. ఈ రోజు మా కాన్ఫిడెంట్‌కు కారణం ఏమిటో ఈ సినిమా విడుదల తరువాత అందరికి తెలుస్తుంది' అన్నారు. హీరో అన్షు మాట్లాడుతూ.. నా ఫేవరెట్ సింగర్ మంగ్లీ నా సినిమాలో పాట పాటడం ఆనందంగా ఉంది. ఈ పాటకు మంచి ట్యూన్‌ను చరణ్ అర్జున్ అందించారు. ఈ రోజు నా ఆత్మవిశ్వాసానికి కారణం దర్శకుడు బిక్షు, నిర్మాత వెంకట్. టీజర్ విడుదల చేశాం. చాలా వైరల్ అయ్యింది. టీజర్ చూసి అందరూ మిస్ అండర్ స్టాండింగ్ చేసుకున్నారు. సినిమా చూసిన తరువాత అందరి ఆలోచన మారిపోతుంది.




# నా ఫోటోలు తీయకండి ప్లీజ్: మౌనీరాయ్

బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై ఆసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారెంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు. 'నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా' అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్ట్‌ను డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తున్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసమే 'ఎస్ఐఆర్'

## సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు

**అక్షరకలం చౌటుప్పల్**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి కాకుండా, రాబోయే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు ఆరోపించారు. సోమవారం చౌటుప్పల్‌లో సీపీఐ(ఎం) నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యలతో పెరిగిన ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించేందుకు 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియ చేపట్టారని విమర్శించారు. మైనారిటీలు, దళితులు, గిరిజనులు, పేద వర్గాల ఓట్లను తొలగించడమే లక్ష్యంగా బీజేపీ వ్యూహాలు పన్నుతోందన్నారు. బీహార్, బెంగాల్, అస్సాంలలో నిర్వహించిన ఎస్ఐఆర్ ద్వారా అనేక మంది అర్హుల ఓట్లను తొలగించారని, ఒక్క బెంగాల్‌లోనే





కోటి ఓట్లు తొలగిస్తే ఆందోళనల ద్వారా కోర్టు జోక్యంతో 70 లక్షల ఓట్లు తిరిగి వచ్చాయని గుర్తుచేశారు. తెలంగాణలోనూ ఇదే వ్యూహాన్ని అమలు చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని, రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్ష బలాన్ని దెబ్బతీసేలా సరిహద్దులు మారుస్తున్నారని పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి ఓటరు తమ పేరు జాబితాలో ఉందో లేదో సరిచూసుకోవాలని, ఎస్ఐఆర్‌పై సీపీఎం కార్యకర్తలు గ్రామస్థాయిలో ప్రజలను అప్రమత్తం చేయాలని రాఘవులు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి. పాష అధ్యక్షత వహించిన ఈ సెమినార్ లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ళ ఆశయ్య, కొండమడుగు నరసింహ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజ్ గౌడ్, కల్లూరి మల్లేశం, బూరుగు కృష్ణారెడ్డి, జల్లెల పెంటయ్య, గుంటోజు శ్రీనివాసచారి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు రాయగిరి కిష్టయ్య, సిరిపంగి స్వామి, అవ్వారు రామేశ్వరి, బొడ్డుపల్లి వెంకటేష్ ,మద్దెల రాజయ్య, దూడ యాదిరెడ్డి, కోట రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని వృద్ధుడు ఆత్మహత్య



**అక్షర కలం : చిట్యాల**

వృద్ధాప్య సమస్యలు, అనారోగ్యం తాళలేక ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెలిమినేడు గ్రామానికి చెందిన నీలా పాండురయ్య (70) గత కొంతకాలంగా వృద్ధాప్య భారంతో పాటు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం (జూలై 20) ఉదయం దాదాపు 07:00 గంటల ప్రాంతంలో తన నివాసంలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారని తెలిపారు. మృతుడి పెద్ద కుమారుడు నీలా వెంకటరావు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు చిట్యాల సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. రవికుమార్ తెలిపారు.

## చేనేత కార్మికుల సమస్యలను దగ్గర్నుంచి చూశా

**సొసైటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



**అక్షరకలం, చౌటుప్పల్**

చేనేత కార్మికులకు ప్రభుత్వానికి వారధి లాగా చేనేత సహకార సంఘాలు పనిచేయాలని అన్నారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. మునుగోడు మండల కేంద్రంలోని మునుగోడు చేనేత సహకార సంఘం ఉత్పత్తి క్రయవిక్రయ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. తమ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకి ఘనస్వాగతం పలికి సన్మానించారు పాలకవర్గ సభ్యులు. మునుగోడు నియోజకవర్గం చేనేత పనికి, చేనేత కార్మికులకు పెట్టింది పేరని మర మగ్గాలు వచ్చిన తర్వాత చేనేత కార్మికుల జీవనాలు కొంత అస్తవ్యంగా తయారయ్యాయని పని దొరకడం లేదని దొరికిన పనికి సరైన ఉపాధి రావట్లేదని ఆవేదన చెందారు. తాను రాజకీయాలలోకి రాకమునుపే వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేత కార్మికులకు రుణమాఫీ చేయించాలని గుర్తు చేశారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాల పాలకవర్గ సభ్యులతో మాట్లాడి చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విడతల వారీగా పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

## కొండమల్లేపల్లిలో ఉత్సాహంగా ఇంటింటికీ మొక్కల పంపిణీ

**అక్షరకలం దేవరకొండ**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఉత్సాహంగా సాగుతోంది. ఇందులో భాగంగా బిసి కాలనీలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి ఇంటికీ రెండు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పసునూరు యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ... భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత పౌరులపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్, ఉప సర్పంచ్ భర్త వెంకటయ్య, వార్డు సభ్యులు గంట మల్లేష్, బిజిలి లింగయ్య, కొండల్, వస్కుల బక్కలయ్య, వస్కుల శ్రీను, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల అక్షర కలం**

వర్షాకాలంలో ప్రతి నీటి చుక్కను ఒడిసిపడుదామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. వీబీజీ రాంజీ, తెలంగాణ పంచాయతీ రాజ్.. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆద్వర్యంలో రూపొందించిన తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు.



జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇంకుడు గుంతలు, పంట కుంటలు (పామ్ పాండ్), ఊట కుంట (పర్కొలేషన్ ట్యాంక్), బోరు బావుల రీచార్జ్ పనులు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం, లోటు వర్షపాతం నేపథ్యంలో వర్షం నీటిని ఒడిసి పట్టాలని పిలుపు నిచ్చారు. భవిష్యత్తును కాపాడుదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ శాఖ అధికారి జయశ్రీ, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, వ్యవసాయ, నీటి పారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే

**నల్గొండలో తెలంగాణ ఔట్‌సోర్సింగ్ జేఏసీ డిమాండ్**

**ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఐక్య పోరాటానికి నల్గొండ జేఏసీ పిలుపు**

**నూతన కమిటీ ఎన్నిక**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నల్గొండ జిల్లా సమావేశం స్థానిక కాకతీయ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించబడింది. రాష్ట్ర ఉపాధ్యక్షులు యానాల శేఖర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు గాదపాక లింగయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల నుంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సమావేశంలో ప్రతి నెలా జీతాల చెల్లింపులో జరుగుతున్న ఆలస్యం, పీఎఫ్, ఈఎస్ఐ అమలులో నిర్లక్ష్యం, ఉద్యోగ భద్రత లేకపోవడం, సమాన పనికి సమాన వేతనం, సర్వీస్ రక్షణ వంటి పలు ప్రధాన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం జేఏసీ నల్గొండ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నూతన జిల్లా కమిటీ వివరాలు...**

గాలి మురళి (ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖ)?ఉపాధ్యక్షులు: ఊటుకూరు సతీష్ (ఎస్సీ గురుకులం), ఎస్. నిర్మల (ఎం.జీ. యూనివర్సిటీ)?వర్కింగ్ ప్రెసిడెంట్లు.. ఎం. శ్రీనివాస్ (ఎండోమెంట్స్ శాఖ), జి. సందీప్ కుమార్ (ఐసీడీఎస్





శాఖ)?జనరల్ సెక్రటరీ.. పట్టేటి నాగయ్య (ఎం.జీ. యూనివర్సిటీ) ఆర్గనైజింగ్ సెక్రటరీలు.. జి. కృష్ణ (హార్టికల్చర్ శాఖ), జె. నాగరాజు (టీజీబీసీఎల్)?ట్రెజరర్ పండ్ల హరికృష్ణ (మైనారిటీ శాఖ),?మీడియా కన్వీనర్ కె. రాంబాబు (బీసీ గురుకులం),?జాయింట్ సెక్రటరీ జి. సురేష్ (ఎస్సీ గురుకులం),?ఈసీ సభ్యులు గద్దపాటి క్రాంతి కుమార్ (ఆర్‌డబ్ల్యూఎస్), పరశురామ్ (పంచాయతీరాజ్), కొత్తపల్లి రవికుమార్ (బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్), పి. జయమ్మ (ఎస్సీ గురుకులం), జి. నాగరాజు (ఎస్ఈ ఇంజినీరింగ్), పి. రవీందర్ (హార్టికల్చర్) లను ఎన్నుకున్నారు.

**-- ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాలు...**

ఈ సందర్భంగా నూతన కమిటీ పలు కీలక డిమాండ్లతో కూడిన తీర్మానాలను ఆమోదించింది. సమాన పనికి సమాన వేతనం: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం వెంటనే అమలు చేయాలి. ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఉచిత హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు: మధ్యవర్తి ఏజెన్సీల విధానాన్ని తక్షణమే రద్దు చేసి, ప్రత్యేకంగా 'ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ కార్పొరేషన్' ఏర్పాటు చేయాలి. ప్రసూతి సెలవులు: మహిళా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి. సకాలంలో వేతనాలు: ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఐక్యపోరాటాలకు నూతన కమిటీ పిలుపు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడతామని నూతన కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి ఐక్యతే ప్రధాన ఆయుధమని పేర్కొంటూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులందరూ జేఏసీలో సభ్యత్వం తీసుకుని సంఘాన్ని బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## దళిత--గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేయాలి**

**అక్షర కలం/ సింగరేణి:**

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సింగరేణి మండలం లోని దళిత, గిరిజన ఆవాస ప్రాంతాల సమస్యలపై నిర్వహించిన సర్వేలో పలు కీలక సమస్యలు వెలుగులోకి వచ్చాయని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, గృహాలు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, భూమిలేని వ్యవసాయ కార్మికులు ఉపాధి హామీ చట్టం సవరణతో, జీవనోపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారుదళిత, గిరిజన ఆవాస ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక



కార్యాచరణ రూపొందించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం కేటాయించిన నిధులను ఎలాంటి ఆలస్యం లేకుండా విడుదల చేసి, ఆ నిధులను దళిత, గిరిజన ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి నిధుల చట్టం అమలులో ఉందని, దాని లక్ష్యం ఈ వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం జిల్లా లో ఐటీడీఏ ను ఏర్పాటు చేయాలి అన్నారు. అంతోదయ అన్నపూర్ణ కార్డు లబ్ధిదారులుగా పేద దళిత గిరిజనులు అత్యధిక మంది ఉన్నారని 35 కిలోల బియ్యం అందించే ఈ కార్డులు రద్దు చేయడం వల్ల వర్గాలకు తీవ్ర నష్టం జరుగుతుందని కేంద్రం అంతోదయ కార్డుల రద్దు ప్రయత్నం విరమించుకోవాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు మొదటి విడత లో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసిన లబ్ధిదారులకు చివరి బిల్లులు నేటికీ విడుదల కాలేదా కేంద్రం ఇవ్వవలసిన ఎన్ఆర్ఈజీ ఎస్ కింద ఇచ్చే రూ 60 వేలు వెంటనే విడుదల విడుదల చేయాలని దళిత గిరిజనులకు 6 లక్షల రూపాయల బిల్లులు చెల్లిస్తామన్న హామీని అమలు చేయాలని రెండో విడతలో అర్హులైన వారందరికీ రాజకీయ పక్షపాతా లేకుండా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారువిద్య వైద్యం ఇల్లు ఇళ్ల స్థలాలు పోడుహక్కుల ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సర్వేలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు ఆయన డిమాండ్ చేశారు తీసుకోవాలని, నిరుపేద దళిత, గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు.

## గిరిజన దర్బార్ లో వచ్చిన ప్రతి విన్నపాన్ని సకాలంలో పరిష్కారం చూపాలి.

**అక్షర కలం / భద్రాచలం**

సోమవారం వారం నాడు భద్రాచలం ఐటిడిఏ. కార్యాలయంలోనిసమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ కార్యక్రమంలోఉమ్మడిఖమ్మం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చినగిరిజనులువిన్నపాలను, ఫిర్యాదులనుఐటీడీఏ, పీవో. బి. రాహుల్, ఎస్ డిసి. ఆనందకుమార్, గురుకులం ఆర్ సి ఓ అరుణకుమారి, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఎడిఎంహెచ్వో. సైదులు, తో కలిసి స్వీకరించారు. భూవివాదాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలికవసతులు, సామాజికభద్రతతో పాటు ఇతర శాఖలకుసంబంధించిన సమస్యలను గిరిజనులు పిఓ. దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన ఐటీడీఏ. పీవో, గిరిజనుల సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల యూనిట్ అధికారులకు వెంటనే పంపుతూ, నిర్దేశితగడువులోపరిష్కారంచూ పాలనిఆదేశించారు. తక్షణమేపరిష్కరించగలసమస్యలనుఆలస్యంచేయకుండపరిష్కరించాలని, మిగిలినవిన్నపాలపై నిరంతరపర్యవేక్షణకొనసాగిస్తూ గిరిజనులకున్యాయంజరిగేలా చర్యలుచేపట్టాలని సూచించారు. ఈసందర్భంగా పివో. మాట్లాడుతూ. గిరిజన దర్బార్ కార్యక్రమం గిరిజన ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే ప్రత్యేకమైన వేదిక అని అన్నారు. గిరిజన ప్రజల నుంచివచ్చినప్రతిదరఖాస్తునుకేవలం నమోదు చేయడమే కాకుండా, వాటి పరిష్కారానికి స్పష్టమైనకార్యాచరణ రూపొందించి ఫలితాలు కనిపించేలా యూనిట్ అధికారులుపనిచేయాలని సూచించారు. శాఖలమధ్యసమన్వయంతోవ్యవహరిస్తేసమస్యలపరిష్కారంమరింతవేగవంతమవుతుందనితెలిపారు. ఫిర్యాదులపరిష్కరంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావు లేకుండా ప్రతిఅధికారిబాధ్యతతోవ్యవహరించాలని ఐటీడీఏ. పీవో. సూచించారు. అర్హులైన ప్రతిఒక్కరికీప్రభుత్వ సేవలు సకాలంలోఅందేలాచిత్తశుద్ధితోపనిచేయాలనిసూచించారు. గిరిజనప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలనుసమర్పిసే సమస్యల పరిష్కారంమరింతవేగంగాజరుగుతుందని తెలిపారు.



అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ–సూర్యాపేట–యాదాద్రి

# నల్లగొండ కార్పొరేషన్‌కు కొత్త సారథి

## కమిషనర్ గా వంశీకృష్ణ బాధ్యతల స్వీకరణ



**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

నల్లగొండ నగరపాలక సంస్థ (మున్సిపల్ కార్పొరేషన్) నూతన కమిషనర్‌గా బి. వంశీకృష్ణ సోమవారం అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. జూన్ 30న పదవీ విరమణ పొందిన మాజీ కమిషనర్ బి. శరత్ చంద్ర స్థానంలో, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీ ఉత్తర్వుల మేరకు ఆయన ఈ బాధ్యతలను చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన కమిషనర్ వంశీకృష్ణ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, ఉన్నతాధికారుల మార్గదర్శకాలకు అనుగుణంగా నగర పాలనను మరింత పారదర్శకంగా ముందుకు తీసుకెళ్తానని స్పష్టం చేశారు.?నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాననిమేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,?స్థానిక కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగుల పూర్తి సహకారాన్ని తీసుకుంటూ నల్లగొండ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు శ్రమిస్తానని వెల్లడించారు. కాగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ”కరువు నిర్వహణలో రేవంత్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

**తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి**

**తెలంగాణలో తీవ్రమవుతున్న సాగు, తాగునీటి ఎద్దడి**

**కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసి చూపేందుకు కుట్రలు**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ప్రభుత్వానికి అసలు చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మరో 15 రోజుల్లో రిజర్వాయర్లలో నీళ్లు పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదం ఉందని, గోదావరి నుంచి సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని వాడుకునే కనీస తెలివితేటలు ఈ పాలకులకు లేవని నాయకులు మండిపడ్డారు.

**మిషన్ భగీరథకు గ్రహణం.. విద్యుత్ కష్టాలు పునరావృతం...**

బీఆర్ఎస్ హయాంలో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద కరువు సమయంలోనూ పంటలకు సమర్థవంతంగా నీరందించామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం కనీసం 'మిషన్ భగీరథ' ద్వారా తాగునీటిని కూడా సరిగా సరఫరా చేయలేకపోతోందని ఆరోపించారు. రోజుకు 12 గంటలు కూడా సక్రమంగా విద్యుత్ ఇవ్వడం లేదని, 2014 కంటే ముందున్న దుర్భర పరిస్థితులు మళ్లీ వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాగార్జున సాగర్ నుండి ఏపీ సీఎం



చంద్రబాబు యథేచ్ఛగా 50 టీఎంసీల నీటిని తరలించుకుపోతున్నా రేవంత్ ప్రభుత్వానికి పట్టింపు లేదని, ఫలితంగా నల్గొండ, హైదరాబాద్‌లకు తీవ్ర నీటి ఎద్దడి రాబోతోందని హెచ్చరించారు. ?”ముందే అలర్ట్ కావాల్సిన ప్రభుత్వం టైమ్ పాస్ చేసి, ఇప్పుడు నష్టం జరిగాక జిల్లా రివ్యూలంటూ డ్రామాలు ఆడుతోంది. ఇంకుడు గుంతలు, పంపాడ్లు తొవ్వాలంటూ రైతులను మభ్యపెడుతుందే తప్ప, మార్కెట్లో విత్తనాలు, ఎరువులు కూడా లభించడం లేదు. ఐఆర్ఆర్, కాళేశ్వరంపై బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలన్నీ అబద్ధాలని, ఆయనకు నీటిపారుదల శాఖపై కనీస అవగాహన లేదని ఘాటుగా విమర్శించారు. నీకు నిజాయితీ, దమ్ము ఉంటే నువ్వు వాడిన ల్యాప్‌టాప్, సిస్టమ్ ఇవ్వు. కాళేశ్వరం గొప్పదనం ఏంటో నిరూపించి నీ కళ్లు తెరిపిస్తా. కన్నెపల్లి పంపులను ఆన్ చేసి ఎస్సారెస్పీ సహా అంతటా నీళ్లు ఇవ్వొచ్చని ఆధారాలతో సహా చూపిస్తానని అన్నారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు బ్రహ్మాండంగా ఉన్నాయని, ఎన్డీఎస్ఏ కూడా వీటిపై ఏ ప్రతికూల నివేదిక ఇవ్వలేదని స్పష్టం చేశారు. కేవలం కరెంట్ బిల్లులు కట్టాల్సి వస్తుందనే దుర్బుద్ధితోనే కాళేశ్వరాన్ని పక్కనపెట్టి రైతులను బలిచేస్తున్నారని ఆరోపించారు.

**కన్నెపల్లిని మాకు అప్పజెప్పండి.. నీళ్లు ఇచ్చి చూపిస్తాం...**

ఇప్పటికే 150 టీఎంసీల గోదావరి నీటిని సముద్రం పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ, బసవాపూర్ వరకు నీటిని పారించే బాధ్యత తాము తీసుకుంటామని ప్రకటించారు. కన్నెపల్లి రిజర్వాయర్‌ను తమకు అప్పగిస్తే నీళ్లు ఎలా ఇవ్వాలో చేసి చూపిస్తామని, ఆ మాటకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ?ప్రజలను నమ్మించేందుకు ఉత్తమ్, రేవంత్ కలిసి నాటకాలు ఆడుతున్నారని, కరువు పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కరువు గండం.. కార్యాచరణే మార్గం

**ఎల్ నినో తీవ్రతపై మంత్రుల అత్యవసర సమీక్ష**

**తాగునీటికే ప్రథమ ప్రాధాన్యం**

**రైతుల్లో అవగాహన పెంచాలని అధికారులకు దిశానిర్దేశం**

**ప్రాజెక్టులు, విద్యుత్ పరిస్థితులపై సుదీర్ఘ చర్చ**

**కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

**కాళేశ్వరం కాదు.. కూలేశ్వరం అంటూ ఎండగట్టిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**





ఎల నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ప్రజలు తాగునీరు, విద్యుత్తు, వ్యవసాయం, తదితర విషయాల్లో ఇబ్బందులు పడకుండా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలోని ఉదయాదిత్య భవన్లో ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనే సంసిద్ధత, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, తదితర అంశాలపై ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహిస్తూ ఎల్ నినో వల్ల ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎల్ నినో వల్ల రాబోయే రోజుల్లో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నందున ప్రత్యేకించి వ్యవసాయం, సాగునీరు, తాగునీరు అన్నింటికి సమస్యలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. రాబోయే పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు అన్ని రకాలుగా ప్రజలకు అండగా నిలబడాలని, ముఖ్యంగా రైతులు పంటల మార్పిడి, ఆరుతడి పంటల వైపు వెళ్లేలా అవగాహన కల్పించాలని, ప్రస్తుతం వేసుకున్న పంటలు కాపాడేందుకు ప్రయత్నించాలని, వర్షపాతంపై ఎప్పటికప్పుడు ప్రజలను, రైతులను అప్రమత్తం చేసి నష్టపోకుండా చూడాలని, భూగర్భ జల , వ్యవసాయ, ఉద్యాన తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇది వరకే వరి వేసుకున్న రైతులను ఆదుకునే విధంగా చూడాలని, సాగునీటి కోసం ప్రత్యేకంగా బోర్లు వేయకుండా నియంత్రించాలని, తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

**కాళేశ్వరం కూలేశ్వరమే....**

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో వల్ల అంతర్జాతీయ స్థాయిలో విపత్కర పరిణామాలు ఏర్పడతాయని, మన దేశంలో సూపర్ ఎల్ నినో గా నిపుణులు చెబుతున్నారని, ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉన్న దృష్ట్యా ఎట్టి పరిస్థితులలో రైతులు వరి సాగు చేయకుండా అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా ప్రాజెక్టులలో నీరు లేకపోవడం ,వర్షాలు తక్కువగా ఉన్న విషయాన్ని రైతులకు విస్తృత ప్రచారం కల్పించాలని బోర్లు వేసుకున్నప్పటికీ చివరి వరకు నీరు వచ్చే అవకాశం లేనందున పంటలు వేసుకుని ఇబ్బందులు పడే పరిస్థితి తీసుకురావద్దని, వాస్తవ పరిస్థితిని గమనించి రైతులు ముందుకు వెళ్లాలని కోరారు. అంతేకాక ప్రస్తుతం ప్రాజెక్టులలో ఉన్న నీరు తాగునీటికి మాత్రమే సరిపోతుందనే విషయాన్ని గమనించాలని, వర్షాలు రాకుంటే వచ్చే జూలై వరకు తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని, ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలకు వెళ్లాలని, పంట మార్పిడి పై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. తాగునీటికి సంబంధించి దేవరకొండ నియోజకవర్గం లో తాగునీరు అందించేందుకు లింకేజీ ఏర్పాటు




చేయాలని, ఉమ్మడి జిల్లాలోని ఎస్ఎల్బీసీ, డిండి తో పాటు, ఆయా నియోజకవర్గాలలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులన్నింటిని ఈ హయాంలోనే పూర్తి చేస్తామని, దేవాదుల ఫేస్ -6 ద్వారా తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి జలాలు అందిస్తామని, డిండి ప్రాజెక్టు పనులు, దున్నపోతుల గండి, బస్వాపూర్ లను వేగవంతం చేస్తామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాస్తవ పరిస్థితులను సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, మీడియా తదితరులకు వివరించారు. కాళేశ్వరం కూలేశ్వరమే నని, వరదనీటికి తట్టుకోలేదని, కూలిపోయిందని ప్రభుత్వాన్ని బదలాం చేసేందుకే బిఆర్ఎస్ వాళ్లు నీటి విడుదల చేయమని రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు.

**అధికారులు ప్రజలకు అండగా ఉండాలి...**

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడే పరిస్థితులను ఎదుర్కోవడంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ జిల్లా ప్రజలకు అండగా నిలబడాలని కోరారు. ఎల్ నినో వల్ల ఏర్పడ్డ కరువు పరిస్థితులతో ప్రజలు అధైర్య పడవద్దని, రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, కరువు పరిస్థితిలో ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని, ఎస్ఎల్ బీసీ 600 మీటర్లు పూర్తయిందని, ఆగస్టు 2028 నాటికి ఎస్ఎల్బీసీ పూర్తి అయితే ఉమ్మడి నల్గొండ జిల్లా మొత్తం సస్యశ్యామలమవుతుందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాగునీటిని దృష్టిలో ఉంచుకొని ఉదయ సముద్రం లో నీళ్లు నింపాలని, మూసి నుండి తిప్పర్తి మండలానికి సాగునీటిని వదలాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవరకొండ నియోజకవర్గం లోని మూడు మండలాలలో తాగునీటి సమస్య గడిచిన మూడు నెలలుగా ఉన్నందున అక్కడ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సమస్యను పరిష్కరించాలని, వెంటనే గ్రామాల ప్రజలకు తాగునీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. నల్గొండ నియోజకవర్గంలో ఇదివరకే వరి నాట్లు వేసుకున్న రైతులకు ఓవర్ లోడ్ కాకుండా అవసరమైతే అదనపు పవర్ కు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించాలని, బడ్జెట్ మెటీరియల్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, లో వోల్టేజ్ ఉన్నచోట ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, ఇప్పటి వరకు వేసిన పంటలు కాపాడాల్సిన అవసరం ఉందని, ఇందుకు ప్రతిరోజు సమీక్షించాలని మంత్రి ఆదేశించారు.

**నీళ్లు వచ్చే అవకాశాలు లేకుండా పోయాయి...**

ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ బస్వాపూర్, మల్లన్నసాగర్ ల్యాండ్ ఆక్విజేషన్ కు సంబంధించిన 87 కోట్ల రూపాయలు విడుదల చేస్తే గంధమళ్ళ పూర్తవుతుందని, శామీర్పేట వద్ద 5 కిలోమీటర్ల పని పనులు పూర్తికానందున భువనగిరి, ఆలేరుకు నీళ్లు వచ్చే అవకాశాలు లేకుండా పోయాయని, ప్రభుత్వం ఇదివరకు నిధులు మంజూరు చేసినందున సంబంధిత ఏజెన్సీపై ఒత్తిడి తీసుకొచ్చి వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. నియోజకవర్గంలో 7 సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని, పనులు మొదలు పెట్టారని, ఇప్పటివరకు ఇంకా పూర్తి కాలేదని, సంబంధిత అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరారు. -పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ... తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు మాట్లాడుతూ బునియదిగాని కాలువ భూసేకరణకు బడ్జెట్ మంజూరు చేయాలని, దేవాదుల ఫేస్ -6 ద్వారా తుంగతుర్తి నియోజకవర్గానికి నీళ్లు అందించాలని, తన నియోజకవర్గంలో తాగునీటికి సంబంధించి బోర్ల తవ్వకానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో విపత్కర పరిస్థితుల దృష్ట్యా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఆరుతడి పంటలైన కందులు, పెసర్లు వంటివి వేసేందుకు రైతులు సుముఖంగా ఉన్నప్పటికీ కోతుల బెడద వల్ల పండించలేకపోతున్నారని, ఈ కోతుల బెడదను తప్పించేందుకు అధికారులు చూడాలని, అలాగే నియోజకవర్గంలోని లిఫ్టుల మరమ్మతులను పూర్తిచేయాలని, చెరువు కట్టలను బలోపేతం చేయడం, జంగిల్ క్లియరెన్స్ చేయాలని కోరారు. కోదాడ శాసనసభ్యురాలు పద్మావతి రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో వల్ల ఏర్పడిన కరువు పరిస్థితులను అధిగమించడంలో భాగంగా భూగర్భ జలాలను పెంపొందించుకునేందుకు సోక్ పిట్ల నిర్మాణం, ఊట కుంటల నిర్మాణం చేపట్టాలని, అలాగే రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా అవగాహన కల్పిస్తామని, అయితే కోతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ మాట్లాడుతూ డిండి ప్రాజెక్టు నుండి తాగునీటికి ఎలాంటి అవకాశం లేనందున దీనికి లింకేజీ ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలో పవర్ ట్రాన్స్ఫార్మర్లు లేనందున 132 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట పట్టణానికి తాగునీటి సమస్య లేకుండా ప్రతిరోజు నిర్దేశించిన పరిమాణంలో తాగునీటిని అందించాలని, సమస్య తీవ్రం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను కోరారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి వేసే అవకాశం లేనందున పత్తి వేసేందుకు అవకాశం ఉందని, అయితే పత్తి రైతులను పెద్ద ఎత్తున ఆదుకోవాలని, మిషన్ భగీరథ నీరు మునుగోడు నియోజకవర్గంలో సరిగా రావడం లేదని, ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ మిషన్ భగీరథ నీటిని అందించాలని ,విద్యుత్ కు సంబంధించి రైతులు చాలా చోట్ల డీడీలు కట్టారని, వారికి కనెక్షన్లు ఇప్పించాలని కోరారు. సమావేశం ప్రారంభమైన వెంటనే నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఎల్ నినో ప్రభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధత, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, ఉమ్మడి జిల్లా తరఫున పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశానికి సమర్పించారు. ప్రభుత్వ విప్ , నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, స్పెషలాఫీసర్, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన సెక్రటరీ హరిచందన దాసరి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్లు, నల్గొండ రెవెన్యూ, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి ,ఆయా జిల్లాల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయం, నీటిపారుదల, ఉద్యాన, విద్యుత్తు, మిషన్ భగీరథ, భూగర్భ జల ,గ్రామీణ అభివృద్ధి, పశుసంవర్ధక శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ జలసిరిపై రూపొందించిన గోడపత్రికను మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు ఆవిష్కరించారు.

# కూలీలతో ఉప ముఖ్యమంత్రి భట్టి 'మాట-మంతి

**గండగలపాడు మార్గంలో పొలాల్లోకి వెళ్లి భట్టి విక్రమార్క**

**ఆనందంలో రైతు కూలీలు**

**క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల ఆరా..**

**'ఇందిరమ్మ ఇళ్లతో' మా కలలు నిజమయ్యాయన్న మహిళలు.**

**కూలీల చెంతకు 'ప్రజా ప్రభుత్వం**



**అక్షరకలం/ ఉమ్మడి ఖమ్మం బ్యూరో:**

గండగలపాడు నుంచి స్నానాల లక్ష్మీపురం వెళ్లే మార్గమధ్యంలో ఒక అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాన్వాయ్ అకస్మాత్తుగా ఆగింది. భద్రతా సిబ్బంది అలర్ట్ అయ్యేలోపే, ఆయనే స్వయంగా రోడ్డు పక్కన పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతు కూలీల వైపు నడిచి వెళ్లారు. డిప్యూటీ సీఎం తమ వద్దకు రావడంతో కూలీలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. వారితో చేతులు కలిపేందుకు, మాట్లాడేందుకు అక్కడి వారంతా పోటీలు పడ్డారు.

'అక్కయ్యా.. పథకాలన్నీ అందుతున్నాయా?'

పొలం గట్టుపై నిలబడి, కూలీలతో ఎంతో ఆత్మీయంగా భట్టి విక్రమార్క ముచ్చటించారు. నేరుగా లబ్ధిదారులతోనే సంక్షేమ ఫలాల తీరును అడిగి తెలుసుకున్నారు.

డిప్యూటీ సీఎం అడిగిన ప్రశ్నలివే..

"అక్కయ్యా! మన ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ మీకు అందుతున్నాయా?"

"మీ ఇంటికి ఉచిత విద్యుత్ సరఫరా వస్తోందా?"

"రేషన్ షాప్ నుంచి సన్న బియ్యం తెచ్చుకుని తింటున్నారా?"

"అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయా?"

ఈ ప్రశ్నలకు కూలీలు ఎంతో సంతోషంగా స్పందిస్తూ..

"ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నీ మాకు అందుతున్నాయి సార్.. ముఖ్యంగా మాలాంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని తమ ఆనందాన్ని పంచుకున్నారు.

ఉపముఖ్యమంత్రి దృష్టికి 'రవాణా' కష్టాలు

ఇదే సమయంలో కూలీలు తమ రోజువారీ ఇబ్బందులను కూడా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వైరా నుంచి ముసలిమడుగు వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. దీనిపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. సాధారణంగా నాయకులు వేదికల పైనుంచి మాట్లాడటం చూస్తాం. కానీ, ఇలా స్వయంగా డిప్యూటీ సీఎం హోదాలో ఉండి కూడా.. కాన్వాయ్ ఆపి, పొలంలోకి వెళ్లి కూలీల కష్టసుఖాలు తెలుసుకోవడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. 'ప్రజా ప్రభుత్వం' అంటే ఇదేనంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గిరిజన మహిళలపై అటవీ శాఖ అధికారుల దాడి దారుణం..!


**మనుబోతులపాడులో పోడు రైతులపై బలప్రయోగం సరికాదు**

**దోషులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి..**

**మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ...**

**అక్షర కలం / పినపాక.**

అశ్వాపురం మండలం మనుబోతుల పాడు గ్రామంలో గిరిజన పోడు రైతులపై, ముఖ్యంగా గిరిజన మహిళలపై అటవీ శాఖ అధికారులు దౌర్జన్యానికి పాల్పడ్డారనే ఆరోప ణలను మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ తీవ్రంగా ఖండించారు. ఈ మేర కు సోమవారం జిల్లా సబ్ కలెక్టర్ వేణుగోపాల్‌తో పాటు జిల్లా అటవీ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూముల్లోకి భారీ యంత్రాలతో ప్రవేశించి భూములను చదును చేయడానికి ప్రయత్నించడం, తమ జీవనాధారాన్ని కాపాడుకు నేందుకు శాంతియుతంగా నిరసన తెలిపిన గిరిజన మహిళలపై బలప్ర యోగానికి పాల్పడటం అత్యంత అమానుషమని ఆమె అన్నారు. షెడ్యూల్డ్ తెగలు మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం 2006 ప్రకారం గిరిజనులకు కల్పించిన హక్కులను పక్కనబెట్టి అధికారులు వ్యవహరించడం చట్టవిరుద్ధమని విమర్శించారు. అటవీ హక్కుల క్లెయిమ్‌లు పరిష్కా రం కాకముందే భూములను చదును చేయడం, పంటలను ధ్వంసం చేయ డం గిరిజనుల జీవన హక్కులపై ప్రత్యక్ష దాడేనని పేర్కొన్నారు. ఈ నెల 19న జరిగిన ఘటనపై ఉన్నతస్థాయి స్వతంత్ర విచారణ చేపట్టి, గిరిజన మహిళలపై దాడికి బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై శాఖాపర మైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన మహిళలకు మెరుగైన వైద్య చికిత్స అందించి, తగిన పరిహారం చెల్లించా లని కోరారు. అలాగే రెవెన్యూ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త పరిశీలన పూర్తయ్యే వరకు మను బోతుల పాడు ప్రాంతంలో భూముల చదునీకరణ, తొలగింపులు, బల వంతపు చర్యలను పూర్తిగా నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అర్హు లైన గిరిజన రైతులందరికీ అటవీ హక్కుల పట్టాలు వెంటనే మంజూరు చేసి, భవిష్యత్తులో ఇటువంటి ఘట నలు పునరావృతం కాకుండా ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనుల రాజ్యాంగ బద్ధ మైన హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న పాల్వంచ దుర్గ, ఈ ఘటనపై నిష్పా క్షిక విచారణ జరిపి బాధ్యులైన అటవీ శాఖ అధికారులు, సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాం డ్ చేశారు. సంబంధిత రేంజర్, డివిజ నల్ ఫారెస్ట్ అధికారులను



బదిలీ చేసి, గిరిజనుల్లో విశ్వాసం పునరు ద్ధరించే చర్యలు తీసుకోవాలని కోరారు. అదే వి ధంగా చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారిని తక్షణమే జోక్యం చేసుకుని శాఖాపరమైన దర్యాప్తు నిర్వహించాలని, రాష్ట్ర అట వీ శాఖ మంత్రి బాధిత కుటుంబా లను పరామర్శించి వారికి భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజ నులకు జరిగిన అన్యాయంపై ప్రభు త్వం స్పందించకపోతే బాధితుల తరఫున న్యాయపోరాటానికి కూడా వెనుకాడబోమని పాల్వంచ దుర్గ హెచ్చరించారు.

# వ్యవసాయానికి పరిశ్రమల తోడ్పాటుతోనే రైతుల ఆదాయం పెరుగుతుంది... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ఖమ్మంలో మరిన్ని అగ్రో ఆధారిత పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహం**

**విలువ ఆధారిత వ్యవసాయంతో రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి**

**కొణిజెర్లను పారిశ్రామిక మండలంగా తీర్చిదిద్దుతాం**

**రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు 10 లక్షల ఎకరాలకు విస్తరణే లక్ష్యంలి**

**దేశంలో తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్**

**ప్రతి 10 వేల ఎకరాలకు ఒక ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు లక్ష్యం**

**సీడ్ గార్డెన్‌తో దేశానికే ఖమ్మం కేంద్రంగా మారుతుంది**

**గోద్రెజ్ సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన డిప్యూటీ సీఎం**

**అక్షర కలం/ ఉమ్మడి ఖమ్మం బ్యూరో:**

వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో నిర్మించిన గోద్రెజ్ సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి. గోద్రెజ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, సిపి సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఫ్యాక్టరీలోని ఉత్పత్తి విభాగాలు, ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ యూనిట్లు, నాణ్యత నియంత్రణ వ్యవస్థను పరిశీలించి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం శ్రీ భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యవసాయానికి చిరునామాగా నిలిచిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు హెవీ వాటర్ ప్లాంట్, థర్మల్ పవర్ స్టేషన్, నవభారత్ వంటి పరిశ్రమలు ఉండేవని, జిల్లా పునర్విభజన తర్వాత ప్రస్తుతం ఖమ్మం జిల్లా ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడుతోందన్నారు. పాలేరు జలాశయం, నాగార్జునసాగర్ ఎడమ కాలువ, వైరా రిజర్వాయర్ ఈ ప్రాంత రైతాంగానికి జీవనాధారమని పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెరగాలంటే సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటల సాగు వైపు మళ్లడం అవసరమన్నారు. ఈ అంశాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సమగ్రంగా వివరించారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు నాలుగు సంవత్సరాల కాలంలో ఎకరాకు సుమారు రూ. 52 వేల వరకు ప్రోత్సాహకాన్ని అందిస్తోందని తెలిపారు. సూపర్ ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఆయిల్ పామ్ సాగు నిలకడైన దిగుబడిని అందిస్తుందని చెప్పారు. దేశంలో వంటనూనెల అవసరం ఎక్కువగా ఉన్నదని, దేశీయ ఉత్పత్తి 12 మిలియన్ టన్నులకు మాత్రమే పరిమితమైందన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 3 మిలియన్ టన్నుల వంటనూనె దిగుమతుల కోసం రూ. 1.5 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ అత్యంత అవసరమని స్పష్టం చేశారు. 1991-92లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలో ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ సాగుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సుమారు 15 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, దేశ అవసరాలకు అనుగుణంగా దానిని 70 లక్షల ఎకరాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. 2023లో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ. 12 వేలుగా ఉండగా ప్రస్తుతం సుమారు రూ. 23 వేలకు చేరడం రైతులకు ప్రయోజనకరంగా మారిందన్నారు. వంట నూనెతో పాటు సౌందర్య సాధనాల పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలను కూడా ఆయిల్ పామ్ ద్వారా అందించవచ్చని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఈ సమీకృత పరిశ్రమ ఏర్పాటవడం రైతులకు, యువతకు వరంగా నిలుస్తుందని పేర్కొంటూ, ఈ పరిశ్రమ ఏర్పాటుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం కృషి చేశారని ప్రత్యేకంగా అభినందించారు. గోద్రెజ్ యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్, అధికారులు అందరికీ అభినందనలు తెలిపారు. ఈ పరిశ్రమకు అవసరమైన రహదారి మౌళిక సదుపాయాలను టీజీఐఐసీ ద్వారా త్వరలోనే కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో మరిన్ని వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పడి రైతులు పండించే పంటలకు స్థానికంగానే విలువ ఆధారిత ఉత్పత్తులు తయారయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. దీని వల్ల రైతుల ఆదాయం పెరగడంతో పాటు స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ సమీకృత ప్రాజెక్టులో సీడ్ గార్డెన్, మిల్లింగ్ యూనిట్, రిఫైనరీ వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు కావడం విశేషమన్నారు. భవిష్యత్తులో ఆయిల్ పామ్ విత్తనాల కోసం ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. 113 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ సమీకృత పరిశ్రమ గంటకు 60 నుంచి 120 టన్నుల గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపారు. గోద్రెజ్ సంస్థ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, మిర్చి, పత్తి, వరి ఆధారిత పరిశ్రమలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని సంస్థను కోరారు. రైతులు వాణిజ్య పంటలు, విలువ ఆధారిత వ్యవసాయంపై దృష్టి



సారించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర స్థూల ఆర్థికోత్పత్తి (+ూణూ) సుమారు రూ. 17 లక్షల కోట్లు ఉండగా, వ్యవసాయ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే ఉండటం రైతుల ఆర్థిక పరిస్థితిని సూచిస్తోందన్నారు. రైతుల ఆదాయం పెరగాలంటే వాణిజ్య పంటలు, విలువ ఆధారిత పరిశ్రమలే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. ఇటీవల తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ. 9 వేల కోట్ల పెట్టుబడి సాయం జమ చేశామని తెలిపారు. నాగార్జునసాగర్, కృష్ణా జలాలు, సీతారామ ఎత్తిపోతల పథకం, పాలేరు లింక్, ఎన్మార్కు--రాజీవ్ లింక్ కాలువల ద్వారా లభించే నీటిని వినియోగించుకొని ఖమ్మం జిల్లాలో ఉద్యాన పంటల సాగును మరింత విస్తరించాలని సూచించారు. కొణిజెర్ల మండలం భవిష్యత్తులో రాష్ట్రం లోనే ప్రముఖ పారిశ్రామిక మండలంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న సీడ్ గార్డెన్ ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు నాణ్యమైన ఆయిల్ పామ్ విత్తనాలు అందించే స్థాయికి ఈ కేంద్రం ఎదగాలని అన్నారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలపై ప్రతి గ్రామంలో రైతులతో చర్చలు నిర్వహించి అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గోద్రెజ్ సంస్థ ఆయిల్ పామ్ గెలల కొనుగోలు లో రైతులకు భాగస్వామిగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో ఆయిల్ పామ్ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసే అవకాశాలు మరింత విస్తరించాయని, దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒకప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాకే పరిమితమైన ఆయిల్ పామ్ సాగు, నేడు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, రానున్న 2 నుంచి 3 సంవత్సరాల్లో దానిని 10 లక్షల ఎకరాలకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. దేశం వంటనూనెల్లో స్వయం సమృద్ధి సాధించాలంటే సుమారు 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు అవసరమని చెప్పారు. ప్రస్తుతం దేశంలోని ఆయిల్ పామ్ సాగులో దాదాపు 90 శాతం తెలుగు రాష్ట్రాల నుంచే జరుగుతోందన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు మూడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు పనిచేస్తుండగా, గోద్రెజ్ ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ నాలుగో ఫ్యాక్టరీ అని తెలిపారు. దేశంలో ఇప్పటి వరకు ఆయిల్ పామ్‌కు ప్రత్యేక సీడ్ గార్డెన్ లేకపోవడం గమనార్హమని, గోద్రెజ్ సంస్థ మలేషియా భాగస్వామ్యంతో ఖమ్మంలో దేశంలోనే తొలి ఆధునిక సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. సీడ్ గార్డెన్‌తో పాటు పరిశోధన కేంద్రం, రైతులకు అవగాహన కల్పించే ప్రదర్శన విభాగాలు, శిక్షణా కార్యక్రమాలు, నాణ్యమైన నర్సరీల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు కూడా నేటి నుంచే శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఈ సమీకృత ఆయిల్ పామ్ కేంద్రం రైతులకు అన్ని విధాలా ఉపయోగపడు తుందని మంత్రి పేర్కొన్నారు. రైతుల సందేహాల నివృత్తి, శాస్త్రీయ సాగుపై మార్గదర్శకాలు, నాణ్యమైన మొక్కలు, వ్యవసాయ పరికరాలు, ఎరువులు, పురుగు మందులు, అవసరమైన సాంకేతిక సేవలు ఒకే కేంద్రంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే ఎకరాకు 15 నుంచి 16 టన్నుల వరకు ఆయిల్ పామ్ గెలల దిగుబడి సాధించవచ్చని చెప్పారు. రాష్ట్రంలో త్వరలోనే మరో ఆరు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం నెలకొన్న సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో పంటల వైవిధ్యీకరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల దక్షిణ భారతదేశంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే ఉత్తమ ప్రత్యామ్నాయమని వివరించారు. ఆయిల్ పామ్ రైతులు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నారని, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న అనేక మంది రైతుల కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడి, వారిపిల్లలు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే స్థాయికి ఎదిగారని అన్నారు. ఇతర ఏ పంటతోనూ పోల్చలేనంత ఆదాయం ఆయిల్ పామ్ ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. తాను కూడా ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతునేనని గుర్తు చేశారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించడం రాష్ట్ర ప్రభుత్వ విధానమని తెలిపారు. ఏ జిల్లాలోనైనా 10 వేల ఎకరాలకు పైగా ఆయిల్ పామ్ సాగు ఉంటే అక్కడే ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను పెంచాలని, అలాగే దిగుమతులపై సుంకాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోందన్నారు. ఆయిల్ పామ్ తోటల్లో కంది, పత్తి, పప్పు ధాన్యాలు వంటి అంతర పంటలను విజయవంతంగా సాగు చేయవచ్చని చెప్పారు. తద్వారా రైతులకు ప్రారంభ సంవత్సరాల్లోనే అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. ఖమ్మం జిల్లా దేశానికే స్ఫూర్తిగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పరిశ్రమల ఏర్పాటు ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం, యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. గోద్రెజ్ సంస్థ మరో పరిశ్రమను కూడా ఖమ్మంలో ఏర్పాటు చేయాలనుకుంటే అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధే తెలంగాణ రైతుల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుందని, ఖమ్మం జిల్లా దేశంలోనే ఆయిల్ పామ్ రంగానికి ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్--2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసిందని తెలిపారు. ఆ విజన్‌కు అనుగుణంగా వ్యవసాయ రంగ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ రూపొందించామని, ప్రస్తుతం సుమారు 40 బిలియన్ డాలర్లుగా ఉన్న వ్యవసాయ రంగ ఆర్థిక విలువను 2047 నాటికి 400 బిలియన్ డాలర్లకు పెంచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.36 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, గత మూడు సంవత్సరాల్లోనే 2 లక్షల ఎకరాల కొత్త విస్తీర్ణం ఆయిల్ పామ్ సాగులోకి రావడం దేశంలోనే అత్యధికమని తెలిపారు. గోద్రెజ్ సంస్థకు ఖమ్మం జిల్లాలో 113ఎకరాల భూమిని కేటాయించి, అవసరమైన అన్ని అనుమతులను వేగవంతంగా మంజూరు చేయడం ద్వారా, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దేశంలోనే తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయడం సాధ్యమైందన్నారు. గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ నాదిర్ బి. గోద్రెజ్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశం వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం జాతీయ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో తెలంగాణ ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణలో మహిళలు మరింత చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతు కుటుంబాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగితే ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం మరింత పెరిగి, దేశం వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యం వేగంగా నెరవేరుతుందని పేర్కొన్నారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గోద్రెజ్ సంస్థ దేశ వ్యాప్తంగా ఆయిల్ పామ్ రంగంలో పని చేస్తోందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ, దేశంలోని ప్రముఖ ఆయిల్ పామ్ సంస్థల్లో ఒకటిగా గోద్రెజ్ ఎదిగిందని తెలిపారు. భారత్ ఇప్పటికీ వంటనూనెల అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడుతోందని, దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ దిశగా తెలంగాణ రాష్ట్రం దేశంలోనే వేగంగా ఎదుగుతున్న రాష్ట్రంగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఖమ్మం జిల్లాలో తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇదే ప్రాంగణంలో త్వరలోనే ఎడిబుల్ ఆయిల్ రిఫైనరీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమీకృత ప్రాజెక్టు ద్వారా 700 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కల ఉత్పత్తి కోసం ఖమ్మంలోనే సీడ్ గార్డెన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు మెరుగైన నాణ్యత గల నాట్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఆయిల్ పామ్ సాగు మరింత విస్తరించేందుకు సంస్థ కృషి చేస్తుందని చెప్పారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ అంజనాపురంలో సమీకృత ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నాయకత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. గత 30 సంవత్సరా లుగా ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని రైతులు కోరుకుంటూ వచ్చారని తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభమై, నేడు పూర్తై ప్రారంభోత్సవం జరగడం ఈ ప్రాంత ప్రజల వారని, వారికి ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, సర్పంచ్ లు, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయిల్ పామ్ రైతులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955